

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గద్దమీది బాలరాజు | గురువారం 24-07-2025 | సంపుటి - 24 | సంచిక - 79 రూ : 4 | పేజీలు : 8

# మాటల యుద్ధానికి ముహూర్తం ఖరారు..

- ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు సరేనన్న సర్కారు
- 28న లోక్‌సభలో.. మరుసటిరోజు రాజ్యసభలో
- ఒక్కోసభకు 16 గంటలు కేటాయింపు
- విపక్షాల నిరసనలతో మూడోరోజూ స్తంభించిన పార్లమెంటు



**జులై 23, ఢిల్లీ:** పాక్ ఉగ్రవాద స్థావరాల మీద మన సైన్యం ఇటీవల విజయవంతంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటులో చర్చకు రంగం సిద్ధమైంది. పహల్గాం ఉగ్రదాడితో ముడిపడిన పరిణామాలపై సమగ్ర చర్చ జరగాలని, తాము లేవనెత్తే ప్రశ్నలకు ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటులోనే సమాధానాలు చెప్పాలని విపక్షం గట్టిగా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ప్రధాని బుధవారం విదేశీ పర్యటనకు వెళ్లారు. 26న తిరుగుప్రయాణం అవుతారు. విపక్షాల డిమాండ్ మేరకు ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు మొత్తంగా 16 గంటల సమయం కేటాయించాలని బుధవారం రాజ్యసభ 'సభా వ్యవహారాల సంఘం' (బీఏసీ) నిర్ణయించింది. లోక్‌సభ బీఏసీ సోమవారమే ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 28న దిగువ సభలో, మరుసటి

తరువాయి 2లో



## 'మహాలక్ష్మి'తో..
# ఆర్టీసీ బలోపేతం...

- రాష్ట్రంలో రూ.20 వేల కోట్లతో రోడ్ల మరమ్మతులకు ప్రణాళిక
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- ఎంజీబీఎస్‌లో ఘనంగా మహిళల 200 కోట్ల ప్రయాణ వేడుకలు

2లో

# 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధిస్తాం

- అందుకోసం భాజపా మెడలు వంచుతాం
- బీసీల్లో ముస్లింలను కలిపి రిజర్వేషన్లు కల్పించడంపై ఆ పార్టీది తొండి వాదన
- గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్రల్లోనూ ముస్లింలకు రిజర్వేషన్లు
- ఆ విషయం అమిత్‌షా కూడా చెప్పారు
- అది తప్పయితే పార్టీ నుంచి ఆయన్ను బహిష్కరించండి
- ఉపరాష్ట్రపతిగా దత్తాత్రేయకు అవకాశం ఇవ్వాలి
- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో





## భవిష్యత్తులో...
# విద్యుత్, ఇంటెలిజెన్స్ గ్రిడ్లు

- పాలనలో ఏఐ కీలకంగా మారుతుంది
- రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు విస్తృత అవకాశం
- ఫైర్‌సైడ్ చాట్‌లో మంత్రి లోకేశ్, జీ42 ఇండియా సీఈవో మనూ జైన్ వెల్లడి

**జులై 23, అమరావతి:** రాష్ట్రం డిజిటల్ పవర్‌హౌస్‌గా మారనుందని మంత్రి నారా లోకేశ్ అభిప్రా యపడ్డారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు.. నవకల్పనలకు అవకాశాలు వస్తాయన్నారు. డేటా విప్లవం ద్వారా

తరువాయి 2లో

# రేసులో ఆరుగురు ?

- ఉప రాష్ట్రపతి పదవిపై పలు ఊహాగానాలు
- మళ్లీ గవర్నర్‌కే దక్కుతుందా?



జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీయే కూటమి.. ఎవరిని ఎంపిక చేస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఈ రేసులో ప్రధానంగా ఆరుగురి పేర్లు వినిపిస్తున్నాయి. అందులో సీఎం, గవర్నర్లు, ఎంపీలున్నారు. ఈ ఏడాది అక్టోబరు, నవంబరులో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఉప రాష్ట్రపతి అభ్యర్థిత్వాన్ని మొదటగా పరిశీలించేది బిహార్ నుంచే అన్న ఉహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇందులో ప్రధానంగా మూడు పేర్లు వినిపిస్తున్నాయి. సీఎం నీతీశ్ కుమార్, జేడీయూ ఎంపీ, ప్రస్తుత రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్‌తోపాటు

తరువాయి 2లో





2లో

## ఏడాదిలో పెట్టుబడుల లక్ష్యం
# రూ.10 లక్షల కోట్లు

- ప్రాజెక్టులకు ఫెసిలిటేటర్‌గా వ్యవహరిస్తా
- సీఎంవో నుంచే పర్యవేక్షణ
- ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ-2025 లో సీఎం చంద్రబాబు



**జులై 23, అమరావతి :** ఏడాదిలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలన్నదే లక్ష్యమని.. అందుకు అనుగుణంగా 15 రంగాల్లో పాలసీలు తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు చెందిన ఇన్వెస్టోపియా, ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు (ఏపీ ఈడీబీ )భాగస్వామ్యంతో విజయవాడలో బుధవారం నిర్వహించిన ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ2025 సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సంద[ర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'యూఏఈ నుంచి అమరావతి సహా ఇతర చోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానిస్తున్నాం. ఏపీని పరిశీలించిన తర్వాతే పెట్టుబడులపై నిర్ణయం తీసుకోండి. ప్రాజెక్టుల సాకారం

తరువాయి 2లో



# స్థానిక ఎన్నికల్లో సామాజిక న్యాయమే అస్త్రం

- బడుగుల సంక్షేమమే ధ్యేయమని చాటేందుకు కాంగ్రెస్ కసరత్తు
- కులగణన, బీసీ రిజర్వేషన్లపై నేడు ఢిల్లీలో సీఎం ప్రజంటేషన్

2లో

## మాటల యుద్ధానికి ముహూర్తం ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

సమాధానం ఇస్తారా, లేదా అనేది ఇంకా తేలకపోయినా.. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని విదేశాలకూ మరోసారి స్పష్టంచేసేలా ఆయన మాట్లాడే అవకాశం ఉందని భాజపా సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. చర్చ సమయంలో మోదీ పార్లమెంటులో ఉండాలని తాము బీఏసీ సమావేశంలో డిమాండ్ చేశామని, ప్రభుత్వం దానికి భరోసా ఇచ్చిందని రాజ్యసభలో కాంగ్రెస్‌పక్ష ఉప నాయకుడు ప్రమోద్ తివారీ విలేకరులకు తెలిపారు. వర్షాకాల సమావేశాలు మొదలయ్యాక రాజ్యసభ బీఏసీ సమావేశం జరగడం ఇదే ప్రథమం. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ దీనికి అధ్యక్షత వహించారు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్)పై చర్చకు విపక్షాలు రాజ్యసభలో మరోసారి డిమాండ్ చేశాయి. వాయిదా తీర్మాన నోటీసులిచ్చి.. కార్యకలాపాలను అడ్డుకున్నాయి. సభను మూడుసార్లు కొంతసేపు వాయిదా వేయాల్సి వచ్చింది. నోటీసులను తిరస్కరించి చివరకు గురువారానికి వాయిదావేశారు.

**సభలో ఇలా ప్రవర్తిస్తే సహించను: ఓంబిర్లా**

ఎన్నిసార్లు వారిస్తున్నా సమావేశాలకు కొందరు ఎంపీలు నినాద ఫలకాలతో (ప్లకార్డులతో) వస్తుండటంపై లోక్‌సభలో స్పీకర్ ఓంబిర్లా మండిపడ్డారు. వీధుల్లో ప్రవర్తించినట్లు ఇక్కడా చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. బిహార్ ఓటర్ల జాబితా విషయంలో పలువురు సభ్యులు తన పీఠం వద్దకు వచ్చిమరీ ఆందోళన నిర్వహిస్తుండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ ''ప్రజలు ఏ ఆశలు, ఆకాంక్షలతో మిమ్మల్ని ఎన్నుకున్నారో దానికి తగ్గట్టు మీ ప్రవర్తన ఉండాలి. ప్రజల జీవితాలను సరళతరం చేయడానికి దోహదపడేలా చర్చల్లో మీరు పాల్గొనాలి. పార్లమెంటేరియన్లలా మీరుండాలి. సభలోకి ప్లకార్డులు తీసుకురాకూడదు. మీరు దీనిని ఇలాగే కొనసాగిస్తే నేను నిర్ణయాత్మక చర్యలు చేపట్టక తప్పదు'' అని హెచ్చరించి సభను కొంతసేపు వాయిదావేశారు. తర్వాతా పరిస్థితిలో మార్పులేక గురువారానికి వాయిదావేశారు. వరసగా మూడోరోజూ పార్లమెంటు కార్యకలాపాలు దాదాపు స్తంభించిపోయాయి.

## 'మహాలక్ష్మి'తో ఆర్టీసీ బలోపేతం

హైదరాబాద్: మహాలక్ష్మి పథకం కింద మహిళల ఉచిత ప్రయాణాలతో ఆర్టీసీ ఆర్థికంగా బలోపేతం అవుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ పథకానికి సంబంధించి జీరో టికెట్ల మొత్తాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు సంస్థకు చెల్లిస్తోందన్నారు. బుధవారం ఎంజీబీఎస్‌లో నిర్వహించిన మహాలక్ష్మి మహిళల 200 కోట్ల ప్రయాణ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2,400 కొత్త బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసింది. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు 2,800 ఎలక్ట్రిక్ బస్సులను కొనేందుకు సంస్థ కసరత్తు చేస్తోంది. ఉచిత ప్రయాణమే కాదు.. బస్సులకు అతివలను యజమానులను చేశాం. రాష్ట్రవ్యాప్తంగా రూ.20 వేల కోట్లతో రోడ్ల మరమ్మతులు, అభివృద్ధి చేయడానికి సర్కారు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఆర్టీసీ మునిగిపోతున్న పడవ కాదు... లాభాల్లోకి వస్తున్న ప్రభుత్వ సంస్థ. వచ్చిన ఆదాయంతో కొత్త బస్సులు కొంటోంది. మహాలక్ష్మి పథకానికి ముందు ఒక్క రోజు 45 లక్షల మంది ప్రయాణం చేస్తే ప్రస్తుతం 65 లక్షల మంది ప్రయాణిస్తున్నారు'' అని వివరించారు. అనంతరం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్... పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు. మహిళలు 200 కోట్ల ప్రయాణాలు చేసిన సందర్భంగా రాష్ట్రంలోని 97 డిపోలు, 324 బస్‌స్టేషన్లలో ఘనంగా వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలుతో పాటు నియామకాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రతి గ్రామం నుంచి మండలానికి, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి కొత్త రహదారుల నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని ప్రకటించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. ఈ పథకం అమలుకు ముందు ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 69శాతం ఉండగా.. ప్రస్తుతం 97 శాతానికి పెరిగిందన్నారు. అనంతరం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్న పలువురు మహిళలను, పథకాన్ని సమర్థంగా అమలు చేస్తున్న ఆర్టీసీ సిబ్బందిని మంత్రులు సన్మానించారు. 200 కోట్ల ప్రయాణాల ద్వారా మహిళలు ఆదా చేసుకున్న రూ.6,680 కోట్ల చెక్‌ను ప్రభుత్వం తరఫున ఆర్టీసీ ఉన్నతాధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రేసులో ఆరుగురు?

(మొదటిపేజీ తరువాయి)

బిహార్ గవర్నర్‌గా ఉన్న ఆరిఫ్ మహమ్మద్ ఖాన్. వీరిలో ఒకరికి పదవి దక్కొచ్చనే ప్రచారం జరుగుతోంది. ఉప రాష్ట్రపతి అభ్యర్థి రేసులో నీతీశ్ కుమార్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆశ్చర్యకరంగా బిహార్‌కు చెందిన భాజపా ముఖ్య నేతలు ఆయనను ఉప రాష్ట్రపతి చేయాలని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఈ ఆఫర్‌ను నీతీశ్ అంగీకరించే అవకాశాలు చాలా తక్కువే. కానీ నీతీశ్ రాష్ట్ర రాజకీయాల్లో ఉండగా భాజపా అభ్యర్థి సీఎం కావడం అసాధ్యం. అందుకే నీతీశ్‌ను ఒప్పించేందుకు భాజపా వ్యూహాత్మంగా పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇందుకోసం నీతీశ్‌ను ఉప రాష్ట్రపతి చేసి, ఆయన కుమారుడు నిశాంత్ కుమార్‌ను డిప్యూటీ సీఎం చేసే అవకాశాలూ లేకపోలేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బిహార్‌లోని బీసీ, ఈబీసీ వర్గాల ఓటర్లు ఎన్డీఏ కూటమి వైపు మొగ్గడానికి ప్రధాన కారకుడు నీతీశ్ కుమార్ అని, ఎన్నికల ముంగిట ఆయన్ను బలవంతంగా దూరం చేసుకోవడానికి ఆ కూటమి అస్సలు సాహసించదని ఇంకొందరు పరిశీలకులు తెలిపారు. జేడీయూ నేత హరివంశ్ నారాయణ్ సింగ్ ఉప రాష్ట్రపతి రేసులో ఉన్నారు. జేడీయూ ఎంపీ కావడం ఆయనకు కలిసివచ్చే అంశం. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి హరివంశ్ అత్యంత సన్నిహితంగా ఉంటారు. కేంద్ర ప్రభుత్వానికి విధేయులుగా ఉన్న పలువురు గవర్నర్ల పేర్లను ఉప రాష్ట్రపతి పదవికి పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ కేటగిరీ నుంచి ప్రముఖంగా వినిపిస్తున్న పేరు ఆరిఫ్ మహ్మద్ ఖాన్. ఈయన ప్రస్తుతం బిహార్ గవర్నర్‌గా ఉన్నారు. హిందూ పురాణాలు, గ్రంథాలపై అవగాహన కలిగిన పండితుడిగా ఆరిఫ్‌కు భాజపాలో మంచి గుర్తింపు ఉంది. ముస్లిం వర్గానికి చెందిన ఆయనను ఉప రాష్ట్రపతి చేస్తే.. ముస్లిం ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉన్న బిహార్‌లో కలిసొస్తుందనే అంచనాతో ఎన్డీఏ కూటమి పెద్దలు ఉన్నారని అంటున్నారు. అయితే ఆర్జేడీ అధినేత లాలూతో ఆరిఫ్‌కు సాన్నిహిత్యం ఉంది. దిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీని ముప్పుతిప్పలు పెట్టిన లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను ఉప రాష్ట్రపతి పదవికి పరిశీలిస్తారనే అంచనాలున్నాయి. జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న మనోజ్ సిన్హా పేరూ తెరపైకి వస్తోంది. ఆయన కశ్మీరు పాలనలో తనదైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్నారు. ఆయన పదవీ కాలం ఈ ఏడాది ఆగస్టు 6తో ముగియనుంది. ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక విషయంలో భాజపా అనూహ్య నిర్ణయం తీసుకునే అవకాశాలూ లేకపోలేదంటున్నారు. కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచిన సీనియర్ నేత శశి థరూర్ పేరునూ ప్రధాని మోదీ పరిశీలించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.

# 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధిస్తాం...

దిల్లీ: కేంద్ర ప్రభుత్వంలో ఉన్న భాజపా మెడలు వంచైనా తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు సాధించి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. బీసీల్లో ముస్లింలను కలిపి రిజర్వేషన్లు అమలుచేయడాన్ని అంగీకరించబోమన్న భాజపాది తొండి వాదన అని కొట్టిపారేశారు. బుధవారం ఇక్కడి తన అధికార నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ''బీసీ రిజర్వేషన్లపై శాసనసభలో చర్చ జరిగినప్పుడు భాజపా ఎమ్మెల్యేలు మద్దతు పలికారు. కానీ ఆ పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మాత్రం అందులోంచి ముస్లింలను తొలగించాలని వితండవాదం చేస్తున్నారు. ముస్లిం రిజర్వేషన్లపై కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచందర్‌రావులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న గుజరాత్, యూపీ, మహారాష్ట్రల్లో 40 50 ఏళ్ల నుంచి ముస్లిం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. హోంమంత్రి అమిత్‌షా కూడా ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. అది తప్పయితే ఆయనను భాజపా నుంచి బహిష్కరించండి. లేదా సస్పెండ్ చేయండి. మోదీ పుట్టిన, ప్రాతినిధ్యం వహిస్తున్న గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, ఆర్‌ఎస్‌ఎస్ పుట్టిన మహారాష్ట్రల్లో ముస్లిం రిజర్వేషన్లు రద్దుచేసిన తర్వాతే తెలంగాణలో ఆ డిమాండ్ చేయాలి. ఆ పార్టీకి ధైర్యం ఉంటే ఆ మూడు రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లను రద్దుచేసి చూపాలి'' అని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు.

*** సెప్టెంబరు 30 లోపు అన్ని ఎన్నికలూ పూర్తిచేస్తాం**

'ఈ రిజర్వేషన్ల విషయంలో ఇండియా కూటమిలోని మిగిలిన పక్షాలను కూడా సమన్వయం చేసుకొని కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తెలంగాణ ప్రజలకు న్యాయం చేయడానికి నేను ఇక్కడికొచ్చా. హైకోర్టు ఆదేశాల మేరకు 30 రోజుల్లో స్థానిక సంస్థల రిజర్వేషన్లను నిర్ణయించి సెప్టెంబరు 30 లోపు అన్ని ఎన్నికలూ పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. దాన్ని సాధించాలంటే రాష్ట్ర ప్రభుత్వం చేసిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలి. అందుకోసం దానిపై ఒత్తిడి తేవడానికి పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో కాంగ్రెస్‌తోపాటు, ఇండియా కూటమి ఎంపీలను కలిసి రిజర్వేషన్లను సాధించి బలహీనవర్గాలకు న్యాయం చేయాలన్న లక్ష్యంతో దిల్లీకొచ్చా. అసెంబ్లీలో బిల్లులు చేసి కేంద్రానికి పంపిన విషయం గురించి గురువారం పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీని కలిసి వివరిస్తా. కాంగ్రెస్ ఎంపీలందరికీ కూడా ప్రజంటేషన్ ఇస్తా.

*** వివరాలు అసెంబ్లీలో పెడతాం...**

మేం నిర్వహించిన కులగణనకు సంబంధించిన అన్ని వివరాలూ అసెంబ్లీలో వెల్లడించాం. ఆ తర్వాత ఏర్పాటు చేసిన స్వతంత్ర కమిషన్ మూడురోజుల క్రితం నివేదిక ఇచ్చింది. దానిపై మంత్రివర్గంలో చర్చించి అసెంబ్లీలో పెట్టి ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడిస్తాం. వాటిని బహిర్గతం చేసే ముందు న్యాయపరంగా ఎదురయ్యే సమస్యల గురించి చర్చించుకొని ఇవ్వాల్సి ఉంటుంది. వ్యక్తిగత వివరాలు బహిర్గతం చేయడానికి చట్టం అనుమతించదు. రాష్ట్రంలో 56.4% బీసీలు, 17.45% ఎస్సీలు, 10.8% ఎస్టీలు, 10.9% ఉన్నతవర్గాలు, ఏ కులమూ లేదని ప్రకటించుకున్నవారు దాదాపు 3.9% ఉన్నారు.

**అనడం.. పారిపోవడం భాజపాకు అలవాటు**

మూడు సాగు చట్టాలను రద్దు, జనగణనలో కులగణన అంశాలపై కేంద్రం దిగొచ్చింది. అనడం పారిపోవడం భాజపాకు అలవాటు. కేంద్ర ప్రభుత్వం 10% ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమల్లోకి తెచ్చిన తర్వాత 50% మూలసూత్రమే వర్తించదు. దానికి కాలంచెల్లిపోయింది. ఇప్పుడు 60% రిజర్వేషన్లు అమలవుతున్నాయి'' అని సీఎం పేర్కొన్నారు.

*** దత్తాత్రేయకు ఉపరాష్ట్రపతి పదవి ఇచ్చి భాజపా తన తప్పుల్ని సరిదిద్దుకోవాలి**

ఉపరాష్ట్రపతి స్థానాన్ని తెలంగాణకు చెందిన ఓబీసీ నాయకుడు బండారు దత్తాత్రేయకు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ''రాష్ట్రపతి పదవికి వెళ్లాల్సిన వెంకయ్యనాయుడిని ఇంటికి పంపారు. దత్తాత్రేయ లోక్‌సభ స్థానాన్ని తీసుకొని కిషన్‌రెడ్డికి... బండి సంజయ్ అధ్యక్ష స్థానాన్ని తొలుత కిషన్‌రెడ్డికి, ఇప్పుడు రామచందర్‌రావుకు ఇచ్చారు. అటు తెలుగువారికి, ఇటు వెనుకబడిన వర్గాలకు అన్యాయంచేసిన భాజపా ఇప్పుడు దత్తాత్రేయకు ఉపరాష్ట్రపతి పదవి ఇచ్చి తన తప్పుల్ని సరిదిద్దుకోవాలి'' అని అన్నారు. దత్తాత్రేయ అభ్యర్థిత్వానికి ఇండియా కూటమి మద్దతు ఇస్తుందా అన్న ప్రశ్నకు బదులిస్తూ ఆ విషయం తనకు తెలియదని, తాను తెలంగాణ ప్రజల తరఫున డిమాండ్ చేస్తున్నానని అన్నారు. భాజపా పెద్దలు దిల్లీలో ఎదిగిన తెలుగు నాయకత్వాన్ని పక్కకు తప్పించి మాకు ప్రాతినిధ్యమే లేకుండా చేశారని ఆరోపించారు. కనీసం తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలైనా దత్తాత్రేయకు మద్దతు పలుకుతారా అన్న ప్రశ్నకు స్పందిస్తూ కాంగ్రెస్ ఎంపీలు కేరళ, తెలంగాణ అని వేర్వేరుగా ఉండరని, అంతా కాంగ్రెస్‌కు చెందినవారే కాబట్టి దానిపై కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. హిందీని దేశవ్యాప్తంగా రుద్దడానికి ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశంలో హిందీ తర్వాత అత్యధికంగా మాట్లాడే రెండో భాషగా గుర్తింపు పొందిన తెలుగును కనీసం ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లలో మూడో భాషగా అమలుచేసి చూపాలని డిమాండ్ చేశారు.

*** ఎంపీ సీఎం రమేశ్ కంపెనీకి రోడ్ల కాంట్రాక్టు వచ్చిన మాట వాస్తవమే**

''రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో సొంత ఇళ్లలోని వారి ఫోన్లు కూడా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ పరిస్థితి వచ్చిందంటే వారి మధ్య బంధాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. లోకేశ్‌ను కేటీఆర్ కలవడాన్ని నేను తప్పుబట్టలేదు. నేను పగటి పూట చంద్రబాబును కలిస్తే విమర్శించిన కేటీఆర్.. చీకట్లో లోకేశ్‌ను కలవడాన్ని ఏమంటారని మాత్రమే ప్రశ్నించా. భాజపా ఎంపీ సీఎం రమేశ్ నేతృత్వంలోని రిత్విక్ కంపెనీకి ఫ్యూచర్‌సిటీలో రోడ్ల కాంట్రాక్టు వచ్చిన మాట వాస్తవమే. మేము టెండర్లు బహిరంగంగా పిలిచాం. వాళ్లు కూడా బహిరంగంగానే టెండర్లు వేశారు. ఇందులో దాయడానికి ఏమీలేదు'' అని రేవంత్ వివరించారు.

## ఏడాదిలో పెట్టుబడుల లక్ష్యం రూ.10 లక్షల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

కోసం ఫెసిలిటేటర్‌గా నేనే వ్యవహరిస్తా' అని పేర్కొన్నారు. రెండు ప్రాంతాల మధ్య వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసేందుకు వీలుగా 'ఏపీఈడీబీ ఇన్వెస్టోపియా' మధ్య అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో యూఏఈ ఆర్థిక, పర్యాటకశాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మారి, లులు గ్రూప్ ఛైర్మన్ యూసుఫ్ అలీ, ఇన్వెస్టోపియా సీఈఓ జీన్‌ఫేర్స్, రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్, సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు.

*** అనుమతులపై సీఎంవో నుంచే పర్యవేక్షణ**

దేశంలోనే మొదటి హైడ్రోజన్ వ్యాలీని రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు. 'రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల ప్రతిపాదనలను సీఎంవో నేరుగా పర్యవేక్షిస్తుంది. రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. నీటి వనరులు, వ్యవసాయ రంగంలో ఏపీ అగ్రస్థానంలో ఉంది. డిజిటల్ టెక్నాలజీ, మానవ వనరుల పరంగానూ బలంగా ఉంది. ఆతిథ్య రంగం, ఆయిల్ అండ్ గ్యాస్, పెట్రో కెమికల్స్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. పాలసీ నిబంధనలకు అనుగుణంగా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలను చెల్లిస్తాం. గూగుల్ సంస్థ త్వరలో విశాఖలో అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోంది' అని వివరించారు.

*** లులు వెళ్లి.. వెనక్కి వచ్చింది!**

లులు సంస్థ అంతర్జాతీయ స్థాయి షాపింగ్ మాళ్లను విశాఖ, విజయవాడల్లో ఏర్పాటు చేస్తోందని సీఎం తెలిపారు. అమరావతిలోనూ త్వరలో ఏర్పాటు చేయాలని కోరామన్నారు. 'గత ప్రభుత్వ హయాంలో వివిధ కారణాల వల్ల లులు రాష్ట్రం నుంచి తప్పుకొంది. కూటమి అధికారంలోకి వచ్చాక తిరిగి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. విశ్వసనీయతకు ఇదొక నిదర్శనం' అని పేర్కొన్నారు.

*** ఆరు నెలల్లోనే యూఏఈ సదస్సు**

ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ దేశాల ఆర్థిక సదస్సులో యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మారిని కలిసి ఏపీకి ఆహ్వానించినట్లు సీఎం చెప్పారు. అప్పుడు ఇచ్చిన హామీ మేరకు యూఏఈ మొదటగా ఏపీలో ఇన్వెస్టోపియా సదస్సు నిర్వహించిందన్నారు. 'యూఏఈ నుంచి 50 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆశిస్తున్నామని యూఏఈ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశాల్లో ప్రస్తావిస్తే.. అంతకు మించే వస్తాయని వారు హామీ ఇచ్చారు. పెట్టుబడులు పెట్టేందుకు వివిధ దేశాల్లో జరిపే పర్యటనల సమయంలో 25 శాతాన్ని ఏపీకి కేటాయించాలి' అని సీఎం కోరారు.

## భవిష్యత్తులో విద్యుత్, ఇంటెలిజెన్స్ గ్రిడ్లు

(మొదటిపేజీ తరువాయి)

అంతర్జాతీయంగా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవడంలో రాష్ట్రం ముందువరుసలో ఉంటుందని పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహించిన ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ2025 సదస్సులో భాగంగా పెట్టుబడులకు ముఖద్వారంగా రాష్ట్రం, యూఏఈ పెట్టుబడులు భాగస్వామ్యాలు, వ్యవసాయ సాంకేతికత, ఆహార భద్రత, ఏఐ, డేటా సెంటర్లు.. స్మార్ట్ గవర్నెన్స్ అంశాలపై చర్చలు జరిగాయి. ఏఐ, డేటా సెంటర్లు ఆధునిక ఆర్థిక వ్యవస్థకు కీలక మార్గంగా మారుతున్నాయా? అనే అంశంపై నిర్వహించిన ఫైర్‌సైడ్ చాట్‌లో మంత్రి లోకేశ్, జి 42 ఇండియా సీఈవో మనూ జైన్ పాల్గొన్నారు. మోడరేటర్ రక్షా శారద అడిగిన ప్రశ్నలకు ఇద్దరూ ఆసక్తికర సమాధానాలు ఇచ్చారు. అవి ఇలా..

మోడరేటర్: డేటా సెంటర్లు.. ఆర్థికాభివృద్ధి అవకాశాలపై మీ అభిప్రాయాలు ఏంటి?

మనూ: సీఎం చంద్రబాబును 2015 జూన్‌లో తొలిసారి కలిశాను. దేశంలో 'షావోమి'ని మొదటిసారి ప్రారంభించాలని వచ్చి.. ఏపీని అనువైన ప్రాంతంగా ఎంచుకున్నాం. ఇప్పుడు షావోమి దేశంలోనే అతి పెద్ద కంపెనీ. రాష్ట్రం నుంచే తయారీ జరుగుతోంది.

లోకేశ్: ఏఐ ద్వారా పాలనను చాలా సులువుగా.. ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయవచ్చనేది తెలుసుకున్నా. నేను పాదయాత్ర చేసేప్పుడు భూముల రికార్డుల కోసం ప్రజలు పడే ఇబ్బందులను గమనించా. భూ రికార్డుల్లో ఉన్న తప్పులను సవరించేందుకు ఏఐ వినియోగించి రికార్డులు సరిచేస్తున్నాం. ఏఐని వినియోగించి ప్రజలకు సులువుగా సేవలు అందించడంపై దృష్టి పెట్టా. దీని కోసం వివిధ ప్రభుత్వ శాఖలను అనుసంధానిస్తూ డేటా లేక్ రూపొందించాం.

మోడరేటర్: ఏఐ, డేటా సెంటర్ల భవిష్యత్తును ఎలా చూస్తున్నారు?

మనూ: 25 ఏళ్ల కిందట ఇంటర్నెట్ కొత్తగా వచ్చిన సమయంలో.. ప్రజల జీవితాన్ని మార్చేస్తుందని భయపడ్డారు. దాని సాయంతో ఇప్పుడు 10 నిమిషాల్లో ఆహారం ఆర్డర్ చేసుకోవచ్చు. ప్రపంచంలో ఎక్కడున్నా వీడియో కాల్స్ చేసుకోవచ్చు. రాబోయే 25 ఏళ్లలో ఏఐ, డేటా సెంటర్లు సాంకేతికంగా కీలకం కాబోతున్నాయి. ప్రస్తుతం ఎలక్ట్రిక్ గ్రిడ్ మాత్రమే ఉంది. 25 ఏళ్ల తర్వాత వచ్చే జెనరేషన్ రెండు గ్రిడ్‌లు (ఎలక్ట్రిక్ గ్రిడ్.. ఇంటెలిజెన్స్ గ్రిడ్) వాడతారు.

మోడరేటర్: క్వాంటమ్ కంప్యూటింగ్.. డేటా లేక్స్ లాంటి వాటిపై మాట్లాడుతుంటే.. యూఏఈతో కలిసి పనిచేయడం వల్ల లాభం ఉంటుందా?

లోకేశ్: ఏపీలో డేటా సెంటర్లు వినూత్న ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారతాయి. ఇదే దృష్టితో 201718లో ఆలోచించాం. అప్పట్లో చాట్ జీపీటీ లాంటిది లేదు. విశాఖను దేశానికి డేటా సిటీగా మార్చాలని నిర్ణయించాం. గత ఐదేళ్లలో చిన్న అడ్డంకి వతచ్చింది. ఇప్పుడు సాంకేతికత అందిపుచ్చుకునేందుకు వేగంగా అడుగులు వేస్తున్నాం. ఈ విషయంలో జీ 42 సహకరిస్తుందని భావిస్తున్నాం.

## స్థానిక ఎన్నికల్లో సామాజిక న్యాయమే అస్త్రం

హైదరాబాద్: సామాజిక న్యాయమే ప్రధాన అస్త్రంగా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీలకు ఏకంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. బడుగులకు సామాజిక న్యాయం దక్కాలంటే 42 శాతం రిజర్వేషన్లకు పార్లమెంటులో బిల్లు ఆమోదించాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకే... కులగణన సర్వే తీరుపై ఎంపీలకు గురువారం ప్రజంటేషన్ ఇవ్వడానికి దిల్లీని సీఎం రేవంత్‌రెడ్డి వేదికగా ఎంచుకున్నారని పార్టీవర్గాలు తెలిపాయి. దేశంలో తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలోనే పారదర్శకంగా, పకడ్బందీగా కులగణన చేశామని పేర్కొంటూ... ప్రజంటేషన్ ఇవ్వబోతున్నారు. దీనివల్ల బడుగు, బలహీనవర్గాల సంక్షేమం, సామాజిక న్యాయం కాంగ్రెస్‌కే సాధ్యమనే అంశానికి దేశవ్యాప్తంగా ప్రచారం కల్పించడానికి వీలవుతుందని పార్టీ భావిస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానానికి భాజపా, భారాస ఎమ్మెల్యేలు మద్దతిచ్చారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూలులో రిజర్వేషన్ల పెంపు అంశాన్ని చేర్చాలంటే పార్లమెంటు ఆమోదం తప్పనిసరి. ఒకవేళ కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అందుకు నిరాకరిస్తే ఆ పార్టీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందంటూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది. మరోవైపు, శాసనసభలో రిజర్వేషన్ల తీర్మానాన్ని భారాస సమర్థించినందువల్ల పార్లమెంటులో ఆమోదం కోసం భాజపాపై ఆ పార్టీ కూడా ఒత్తిడి తేవాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. ఒకవేళ దిల్లీలో భాజపా వైఖరిని భారాస సమర్థిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో నిలదీస్తామని చెబుతున్నారు.

*** సాధారణ ఎన్నికలకూ అదే ఎజెండా...**

స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాకుండా వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లోనూ సామాజిక న్యాయం, బీసీలకు రిజర్వేషన్ల కల్పనే ప్రధాన ఎజెండాగా ముందుకెళ్లాలని యోచిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇంతకాలం పలు సామాజిక వర్గాలకు సరైన రాజకీయ ప్రాతినిధ్యం దక్కలేదని, చట్టసభలకు ఒక్కసారి కూడా ఎన్నిక కాలేదని కులగణనలో గుర్తించినట్లు తెలుస్తోంది.

# భూదాన్ ల్యాండ్ లను గుర్తించి లిస్టు పంపాలి

*** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మను చౌదరి**

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : భూదాన్ ల్యాండ్ లను గుర్తించి లిస్టు పంపాలని తహసీల్దార్లకు, మున్సిపల్ కమీషనర్లకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మను చౌదరి సూచించారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ విసి హాల్ లో జిల్లా అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డిలతో జిల్లా కలెక్టరు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలలోని స్లమ్స్ ఏరియాలను గుర్తించి అక్కడ చిన్న చిన్న ఇళ్లలో ఉండే వారిని గుర్తించి ప్రభుత్వ జి ప్లస్ 3,4 అంతస్తులలో పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు వారిని ఒప్పించేందుకు తహసీల్దార్లు చొరవ తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని అన్నారు. . స్లమ్స్ ను అభివృద్ధి చేయాలని అక్కడ అవసరమైన కనీస వసతులను ఏర్పాటు చేయాలని కలెక్టరు ఆదేశించారు. ఇంతకు ముందు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లలో కేటాయించిన



లబ్ధిదారులే ఉంటున్నారా, లబ్ధిదారులు కాకుండా వేరే వాళ్లు ఉంటున్నారా, కేటాయించిన ఇళ్లను అద్దెకు ఇచ్చినారా అనే అంశాలను గుర్తించి నివేదిక అందించాలన్నారు. అవసరమైన చోట నోటీసులు జారీ చేయాలని కలెక్టరు ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఒక బృందంగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు పంపాలన్నారు. భూభారతి లో భాగంగా రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పై సమీక్షి నిర్వహించి ఎన్ని దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి, వాటి తగు చర్యలు తీసుకోవాలని, అవసరవైన వారికి నోటీసులు జారీ చేయాలని కలెక్టరు ఆదేశించారు. ఎక్కడ వర్షపు నీళ్లు నిలువ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీరు నిలువ ఉండే స్థలాలను గుర్తించి నిరంతరం మానిటర్ చేయాలన్నారు. సంబంధిత మెడికల్ ఆఫీసర్లతో సమన్వయం చేసుకుంటూ ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించేలా చూడాలన్నారు. ఆర్బిఎస్కె బృందాలు హాస్టల్స్ ఇనిస్టిట్యూట్స్, స్కూలు వెళుతున్నారా అని తెలుసుకోవాలన్నారు. రేషన్ కార్డులు ఎక్కువ సంఖ్యలో పెండింగ్ లో ఉన్న చోట డిఎస్ఓ తో సమన్వయం చేసుకుంటూ అవసరమైతే అదనపు లాగిన్ ఐడిలు తీసుకొని పెండింగ్ ను క్లియర్ చేయాలన్నారు. కొత్త మున్సిపాలిటీలలో ప్రజల అవసరాల నిమిత్తం ఏమైన ప్రతిపాదనలు ఉంటే తనకు నివేదికలు పంపాలన్నారు. నీర్ణీత ప్రొఫార్మాలలో కోర్టు కేసులకు సంబంధించిన వివరాలను పొందుపరుస్తూ లిస్టులను తనకు పంపాలన్నారు. భారీ వర్షాల సందర్భంగా స్కూల్స్, గ్రామ పంచాయతీలు, కాలేజీలు, మండల భవనాలను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేసుకొని శిథిలావస్థలో ఉన్న ఇళ్లను, నిర్మాణాలను ముందుగా గుర్తించి అక్కడ ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో మిడ్ డే మీల్స్, వంట సామాగ్రిని తరచుగా పరిశీలించాలని, విద్యార్థులకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని, ఏలాంటి సమస్యలు ఎదురవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ హరిప్రియ, ఆర్డిఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాష్, లా ఆఫీసర్ చంద్రావతి, తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశవాణి కేంద్రంలో హెర్బల్ గార్డెన్ ఏర్పాటు ప్రతిపాదన



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణ అధికారిగా కొలిపాక శంకర్ రావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రకృతి ప్రేమికుడు, గ్రీన్ మోటార్ వెహికల్ గార్డెన్ వ్యవస్థాపకుడు సింగరేణియన్, కొట్టూరు . నుర్వి రాజశేఖర్ (మొక్కల రాజశేఖర్), ప్ ప్రకృతి ప్రేమికులు,ప్రకృతి హరిత దీక్ష పరురాలు సెయింట్ మేరీస్ పాఠశాల లో 6వ తరగతి చదువుతున్న నైనిక రజువా ఆయనకు పచ్చని మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ, కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకొని అక్కడ ఔషధ మొక్కలతో కూడిన హెర్బల్ గార్డెన్ ఏర్పాటు చేయాలని కోరారు. శంకర రావుకు కొన్ని ఔషధ మొక్కలను అందజేసి, వాటి వైద్యపరమైన ఉపయోగాలపై సమాచారం కూడా అందించారు. ప్రకృతి పరిరక్షణలో అవిశ్రాంతంగా శ్రమిస్తున్న మొక్కల రాజశేఖర్‌కు గతంలో ప్రధాని నరేంద్ర మోడీ సైతం ప్రశంసలు తెలిపిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, రేడియో జాకీలు, మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

*** బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ :గాజుల రామారం డివిజన్ ఆక్సిజన్ పార్క్ వద్ద రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "వన మహోత్సవం" కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించినపుడే సమృద్ధిగా వర్షాలు పడి వాతావరణ సమతుల్యత ఉంటుందని అన్నాడు. ప్రతీ ఒక్కరూ విధిగా చెట్లను నాటి సంరక్షించినట్లయితే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్, సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, బీట్ ఆఫీసర్ ఎండి. అర్షద్, దూలపల్లి రేంజ్ సిబ్బంది, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, నాయకులు కస్తూరి బాల్ రాజ్,విజయ్ రాంరెడ్డి అడ్వకేట్ కమలాకర్, రుద్ర అశోక్, ఇబ్రహీం ఖాన్, చిన్నా చౌదరి, రాములు గౌడ్, గోవర్ధన్ రెడ్డి, గుబ్బల లక్ష్మీనారాయణ, సాజిద్, హమీద్, శివా నాయక్, ప్రసాద్, జునైద్, గౌస్, సాధు యాదవ్, సంధ్యా రెడ్డి, మామీ తదితరులు పాల్గొన్నారు.

## భవితా కేంద్రాన్ని సందర్శించిన విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం లోని భవితా కేంద్రాన్ని సందర్శించి, దివ్యాంగ పిల్లలతో, వారి తల్లిదండ్రులతో ఇంటర్ యాక్ట్ అయిన విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా మాట్లాడుతూ, దివ్యాంగ పిల్లలకు అందవలసిన సదుపాయాలన్నీ పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. ముఖ్యంగా భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల యొక్క కౌశలాలను అభివృద్ధి పరచుకొని, సాధారణ విద్యార్థులతో సమానంగా విద్యను అభ్యసించే విధంగా ఈ భవిత కేంద్రాలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు.దివ్యాంగ పిల్లలందరికీ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమం లో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలాస్ , ఉన్నత విద్యాశాఖ కమీషనర్ దేవసేన , జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్,అసిస్టెంట్ కలెక్టర్ సౌరబ్ శర్మ, రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్స్ రాజీవ్ , మదన్ మోహన్ , ఆర్జెడి సత్యనారాయణ రెడ్డి , జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకటేశ్వర చారి , జిల్లా కోఆర్డినేటర్ లు నాగరాజ శేఖర్, సైదులు, సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల చిరునవ్వులతో, ప్రభుత్వం మనుగడ...

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మహిళల చిరునవ్వుతోనే ప్రభుత్వం మనుగడ సాగిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ మరియు చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కొత్తగూడెం ఆర్టిసి బస్టాండ్ నందు 200 కోట్ల ఉచిత ప్రయాణాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఎస్పీ రోహిత్ రాజు , స్థానిక సంస్థల అదనపు విద్యాచందన , కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన రెండవ రోజే సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తూ మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 200 కోట్లు మంది ఇప్పటివరకు ప్రయాణాలు సాగించారన్నారు. దీని ద్వారా మహిళలకు ప్రయాణ చార్జీ రూపంలో 6680 కోట్లు ఆదా అయ్యాయి అని అన్నారు. ఈ మొత్తాన్ని ఆర్టీసీ సంస్థకు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఈ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు స్వేచ్ఛ , భరోసా ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కట్టుబడి అన్ని సంక్షేమ పథకాలను మహిళలకే



రూపొందించింది అన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో మహిళా సంఘాల ద్వారా 9 బస్సులు నడుపుతున్నారు అని తెలిపారు. మహిళలను అభివృద్ధి పరచడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలతో ఏ సంక్షేమ పథకమైన ఇందిరమ్మ ఇల్లు, 500 గ్యాస్ సిలిండర్ తదితర పథకాలు అన్ని మహిళలకే రూపొందించడం జరిగిందన్నారు. మహిళలకు ఇవ్వడం ద్వారా తమ కుటుంబాల అభివృద్ధితోపాటు దేశ అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం పరుచుకొని మహిళలను అభివృద్ధి చెందాలన్నారు. దేశంలోనే ప్రభుత్వం చేపడుతున్న పథకాలు తెలంగాణ మోడల్ గా ఉన్నాయన్నారు. కొత్తగూడెం జిల్లా అభివృద్ధిలో భాగంగా కొత్తగూడెం నుండి హైదరాబాద్,నాగపూర్,రాజమహేంద్రవరం వరకు జాతీయ రహదారులు మంజూరు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కొత్తగూడెం ప్రధాన నగరంగా రూపాంతరం చెందుతుందన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి రహదారులతో పాటు విద్య, వైద్య రంగాలలో అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. మణుగూరు నుండి కిరండోల్ రైల్వే లైన్ నిర్మాణానికి మంజూరు కాగా పాండురంగాపురం నుండి భద్రాచలం వరకు 16 కిలోమీటర్ల రైల్వే లైన్ ను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. అదేవిధంగా కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ద్వారా పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఒకప్పుడు నష్టాలలో ఉన్న ఆర్టీసీ సంస్థ ప్రభుత్వం ఏర్పడిన 18 నెల కాలంలో 200 కోట్ల ఉచిత ప్రయాణాలతో 6680 కోట్ల రూపాయలు ఆదాయాన్ని గడించటం చాలా గొప్ప విషయం అన్నారు. ప్రభుత్వం దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కొత్తగూడెం , పాల్వంచలో నూతన బస్టాండ్ల నిర్మాణం చేపట్టాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలు మహిళలు వారి కాళ్ళ మీద వారు నిలబడటం తో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి ఉపయోగపడుతున్నాయి అన్నారు . మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకొని మహిళలు ఉద్యోగాలకు, వైద్య అవసరాలకు, చదువుకోవడానికి ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగపడుతుందని దీని ద్వారా ఆత్మస్థైర్యాన్ని ప్రభుత్వం నింపిందన్నారు. అనంతరం జిల్లాలో మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేసిన మహిళా విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులకు , లబ్ధి చేకూరిన మహిళలకు మంత్రి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రపంచం గర్వించదగ్గ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ రూపొందించాలి..

*** జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లే చారిత్రాత్మక అడుగు...**

*** ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రపంచంలో గర్వించదగ్గ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పాల్వంచలో బుధవారం యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి సంబంధించి నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, కమిషనర్ కాలేజ్ ,టెక్నికల్ ఎడ్యుకేషన్ దేవసేన, కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి, ఇతర విద్యాశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రారంభానికి సంబంధించి అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. వివిధ శాఖల ఉన్నతాధికారుల సూచనలతో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో ప్రవేశపెట్టాల్సిన కోర్సులు, మౌలిక సదుపాయాలు, భవనాల నిర్మాణం, నిధుల సమీకరణ తదితర అంశాలపై సమీక్ష జరిగింది. మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరం నుంచే యూజీ , పీజీ స్థాయిలో బీఎస్సీ జియాలజీ, బీఎస్సీ ఎన్విరాన్మెంటల్ సైన్స్, ఎమ్మెస్సీ జువాలజీ, ఎమ్మెస్సీ ఎన్విరాన్మెంటల్ సైన్స్ కోర్సులు ప్రారంభించాలని, ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌కు సూచనలు ఇచ్చారు.రాబోయే మూడు సంవత్సరాలలో పూర్తి స్థాయి విశ్వవిద్యాలయం నిర్మాణం కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి, విదేశాలలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలను సందర్శించి అభ్యాసం చేసి, అక్కడి అనుభవాల ఆధారంగా మౌలిక సదుపాయాలు, కోర్సుల రూపకల్పన చేయాలని నిర్ణయించారు. అంతేగాక, విద్యార్థులకు పరిశోధనలో ప్రోత్సాహం కల్పిస్తూ, ఉద్యోగ అవకాశాలు పొందేలా యూనివర్సిటీని తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. దీనికోసం రూసా నిబంధనల ప్రకారం నిధుల సమీకరణ చేయాలని కూడా పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ఉన్నత విద్యా రంగానికి సంబంధించిన కీలక అధికారులంతా సమావేశంలో పాల్గొని, ప్రపంచంలో మొట్టమొదటి ఎర్త్ సైన్స్‌కు ప్రత్యేకమైన యూనివర్సిటీ స్థాపనకు అవసరమైన చర్యలు, కోర్సులు, ఉద్యమ కాలంలోనే ఈ యూనివర్సిటీకి సంబంధించిన సంకల్పం తీసుకున్నట్లు గుర్తు చేశారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖనిజ సంపదకు కేంద్రంగా నిలుస్తుందని, జిల్లాలోని



ఖనిజ వనరులను సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రత్యేక ప్రణాళిక అవసరమని పేర్కొన్నారు. కలెక్టర్ ఇప్పటికే ఒక నివేదికను తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారని, శాసనసభ్యుల సహకారంతో ప్రభుత్వం మద్దతు తీసుకురాగలిగామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా జియాలజీ,భూవిజ్ఞానానికి సంబంధించిన విశ్వవిద్యాలయాలు ఉన్నా, పూర్తిగా ఎర్త్ సైన్స్‌కు అంకితమైన విశ్వవిద్యాలయం ఇదే మొదటిదని స్పష్టమైంది.అత్యున్నత స్థాయికి ఈ విశ్వవిద్యాలయం ఎదగాలంటే, యోగితా రాణా లాంటి అనుభవజ్ఞులైన అధికారుల పర్యవేక్షణ ఎంతో కీలకమని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్ట్ కోసం కేటాయించిన 300 ఎకరాల భూమిలో, మూడు సంవత్సరాలలో శాశ్వత భవనాలు, అవసరమైన వసతులతో కూడిన యూనివర్సిటీగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రితో చర్చించి అవసరమైన నిధులను కేటాయిస్తామని పేర్కొన్నారు. అంతిమంగా, ముఖ్యమంత్రి ఆలోచన మేరకు భారత మాజీ ప్రధానమంత్రి, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరుతో ఈ విశ్వవిద్యాలయాన్ని "డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ"గా నామకరణం చేయాలని మంత్రివర్గం ఆమోదించిన విషయాన్ని మంత్రి తెలియజేశారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జిల్లాలో ఎర్త్ సైన్సీ యూనివర్సిటీ ప్రారంభించడం జిల్లా అభివృద్ధికి శుభ పరిణామం అన్నారు. జిల్లా, రాష్ట్ర, దేశంలోని విద్యార్థులకు ఈ విశ్వవిద్యాలయం ద్వారా వారి యొక్క విద్య ప్రమాణాలు పెంచుకోవడానికి , మెరుగైన ఉద్యోగ అవకాశాలు సాధించటానికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ. ఈ విద్యా సంవత్సరం నుంచి యూజీ , పీజీ కోర్సులలో ప్రవేశాలు మొదలవుతాయని, రాబోయే మూడు సంవత్సరాలలో విశ్వవిద్యాలయంలో కావలసిన అన్ని కోర్సులు ప్రవేశపెడతామన్నారు. ఆ కమిటీల ద్వారా ఏ కోర్సులు ప్రవేశపెట్టాలి, ఉపాధ్యాయులు నియామకం వంటి వాటిపై నిర్ణయాలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.కమిషనర్ కాలేజ్ & టెక్నికల్ ఎడ్యుకేషన్ దేవసేన మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ వంటి గొప్ప వ్యక్తి పేరు మీద ఏర్పాటైన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభించటం మన రాష్ట్రానికే గర్వకారణం అన్నారు.జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ ప్రపంచంలోనే జియో లాజికల్ మ్యూజియం గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉందని అన్నారు.అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇల్లందు క్రాస్ రోడ్ లోపల టూరిజం హోటల్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూరిజం హోటల్ నిర్మాణ పనులను త్వరితగతిని పూర్తి చేయాలని., ఆగస్టు నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం మరియు టూరిజం హోటల్ ను ప్రారంభించే విధంగా అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. టూరిజం హోటల్ ఆవరణలో ఆకర్షణీయంగా మొక్కల పెంపకం సుందరీకరణ పనులు పూర్తి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి చైర్మన్ తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్, ప్రొఫెసర్ ప్రతాపరెడ్డి వైస్ ఛాన్స్లర్ కాకతీయ యూనివర్సిటీ, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి వైస్ ఛాన్స్లర్ డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ, ప్రొఫెసర్ శ్రీ రామ్ వెంకటేష్ సెక్రటరీ తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్, ప్రొఫెసర్ వి. రామచంద్రన్ రిజిస్ట్రార్ డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ, సౌందర్య జోసెఫ్ రూసా ప్రతినిధి , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# మహాదేవపురంకు మంచి రోజులు!

* ఒకే మాట-ఒకే బాటగా!
* ఐక్యతతో కాలనీ అభివృద్ధి!:
* అనేక అడ్డంకులు ఎదుర్కొని!...:
* కబ్జా చెరనుండి కాపాడుకుని..:
* కోర్టు తీర్పుతో నిర్మాణాలకు లైన్ క్లియర్!:
* కాలనీ వాసులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ....:
* అభివృద్ధి పథంలో నిలిపిన సంక్షేమ సంఘం నాయకులు!:

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నడిపించే నాయకులు సమర్ధులు అయితే.....తమను నమ్ముకున్న వారికి న్యాయం చేయాలనే బలమైన సంకల్పం ఉంటే ఎంత కష్టాన్ని అయినా భరిస్తూ, ఎంతటి శక్తిని అయినా ఎదురించి గెలవొచ్చు అని నిరూపించారు గాజులరామారం డివిజన్ మహాదేవపురం సంక్షేమ సంఘం నాయకులు.దాదాపు ఇరవై ఏళ్లుగా మహాదేవపురం ప్రజల తరుపున న్యాయపోరాటం చేసారు,వారు చేసిన దర్మ యుద్ధంలో గెలిచి కాలనీ ప్రజలకు భరోసా ఇచ్చారు. ఒక్కటిగా కలిసి ఉంటే ఎన్ని సమస్యలు వచ్చినా అదిగమించవచ్చునని ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఒకే మాటఒకే బాట అన్నట్లుగా వుంటూ కాలనీ అభివృద్ధికి పునాదులు వేసారు. మహదేవపురం కాలనీలో నిర్మాణాలు మొదలై ఇరవై ఏళ్లు దాటినా నాటి నుండి నేటివరకు ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నా సంక్షేమ సంఘం నాయకులు కాలనీ ప్రజలను ఏకతాటిపై నడిపిస్తున్నారు. ఏ ఒక్కరికి సమస్య వచ్చినా ప్రతీ ఒక్కరూ అండగ వుంటూ ఐక్యతా స్ఫూర్తిని చాటుతూ ఇతర కాలనీ ప్రజలకు ఆదర్శం గా నిలుస్తున్నారు.నిరంతరం యుద్ధంలా! 1995 కు ముందు మహాదేవ పురం కాలనీలో మొదలైన ఇండ్ల నిర్మాణాలకు దిన దినగండంలా అనేక సమస్య లు చుట్టూముట్టాయి.ఆ సమస్యలన్ని అదిగమించటానికి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ కాల్లారిగేలా తిరిగారు.ఈ ప్రాంతంలో నిర్మాణాలకు అడ్డుగా వున్న సాంకేతిక సమస్యను అదిగమించడానికి కోర్టులో న్యాయం పోరాటం చేసారు.కూల్చివేతలు ఆందోళనలు: పైసాపైసా కూడబెట్టి సొంత ఇంటి కల నిజం చేసుకోవాలని మహాదేవపురంలో స్థలం కొన్నవారికి ఇంటి నిర్మాణం చేపట్టాలంటే అనేక సమస్యలు ఎదురయ్యాయి.బై నెంబర్ అంటూ ఈ ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టారాదని పలుమార్లు అధికారులు అడ్డుకున్నారు. 2014 లో కాలనీలో నిర్మాణాలను సైతం కూల్చివేశారు. కొన్ని ఏండ్లపాటు ఇక్కడి భూములకు రిజిస్ట్రేషన్ ఆపారు.అధికారులు మారిన ప్రతీసారి, ప్రభుత్వ నిబంధనలు మారినప్పుడల్లా మహాదేవపురంలో నిర్మాణాలకు అడ్డంకిగా మారేది.అసలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోనే సుధీర్గ కాలం పాటు ఇంతటి సమస్యను ఎదుర్కొన్న కాలనీ మరోకటి లేదని చెప్పవచ్చు!

*** శరవేగంగా అభివృద్ధి:మహేశ్వర్ రెడ్డి,సంక్షేమ సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబెర్**



గాజులరామారం ఎల్లమ్మబండ ప్రధాన రహదారికి అనుకోని వున్న మహాదేవపురంలో నిర్మాణాలకు లైన్ క్లియర్ కావడంతో శరవేగంగా అభివృద్ధి వైపు అడుగులు పడుతున్నాయి. విశాలమైన రోడ్లు, ప్రజా ఉపయోగార్థం పార్కులతో ఈ ప్రాంతం ఆహ్లాదకరంగా ఉంటుంది.2014 లో నిర్మాణాలు కూల్చివేసిన సమయంలో ఇక్కడ ప్లాట్ లు కొన్నవాళ్లు ఇబ్బంది పడ్డారు.అనేక ఇబ్బందులు తలెత్తినా సహనంతో ఎదుర్కొన్నాం. నేడు నిర్మాణాలకు అడ్డంకి తొలగిపోవడంతో కాలనీవాసులు సంతోషంగా వున్నారు. ఇరవై ఏళ్లక్రితం ఇక్కడ ప్లాట్లు కొనుకున్నవారు నేడు ఇళ్ల నిర్మాణాలకు సిద్ధం అవుతున్నారు.

*** ఐక్యతోనే సాధ్యం అయింది: కే.వెంకట్ రెడ్డి. మహాదేవపురం కాలనీ అధ్యక్షులు..**



నియోజకవర్గంలో ఏ కాలనీ ఎదుర్కొని సమస్యను మేము ఎదుర్కొన్నాం. సమస్య పరిష్కారం కోసం ఇరవై ఏళ్లుగా కాలనీ ప్రజలం అంతా ఐక్యంగా వున్నాం. 1995 లో మొదటగా మహాదేవ పురం సంక్షేమ సంఘం స్థాపించాను.నాటినుండి నేటివరకు కాలనీలో ఎవ్వరికి ఇబ్బంది వచ్చినా అందరం ఒక్కటై అండగా ఉంటాం.కొందరు వ్యక్తులు ఈ ప్రాంతాన్ని కబ్జా చేయాలని చూస్తే అడ్డుకుని కబ్జా కాకుండా కాపాడుకున్నాం.ప్రస్తుతం నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బంది లేకున్నా కొద్ది నెలలుగా రిజిస్ట్రేషన్ నిలిపివేశారు.ఆ సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తాం.

*** దర్మం గెలిచింది!:**

మహాదేవపురం కాలనీలో ఒక్కో ప్లాట్ 200 గజాలుగా సుమారు 1940 ప్లాట్లు ఉండగా 1995 నుండి 2025 వరకు ఈ కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.లే అవుట్ మొదలైన తొలినాళ్ళలో 1995 లోనే సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన కే. వెంకట్ రెడ్డి కాలనీ అధ్యక్షుడిగా నాటినుండి నేటివరకు ప్రజలందరిని ఏకంచేసి అధికారులకు వాస్తవాన్ని తెలియజేసే ప్రయత్నం చేసాడు.సంక్షేమ సంఘం నాయకులందరూ ఒకే తాటిపై వుంటూ ప్రజాప్రతినిధుల సహకారంతో కలెక్టర్, ఆర్డిఓ స్థాయి అధికారులను కలిసి కాలనీ ప్రజలకు ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లారు.ఎన్ని ప్రయత్నాలు చేసినా కొద్దీ రోజులు నిర్మాణాలకు ఓకే అంటూ, కొద్దీ రోజులు నిర్మాణాలు చేపట్టవద్దంటూ అధికారులు వ్యవహరించారు! దీంతో సంక్షేమ సంఘం నాయకులు చివరగా న్యాయపోరాటం చేయగా మహాదేవపురంలో నిర్మాణాలు చేసుకోవచ్చు అంటూ కొన్ని నెలల క్రితం కోర్టు తీర్పు ఇచ్చింది.దీంతో మహాదేవపురంకు మంచి రోజులోచ్చాయని, సంక్షేమ సంఘం నాయకుల పనితీరు పట్ల మహాదేవపురం ప్రజలు హర్షం వ్యక్తం చేసారు.

## ఈనెల 31వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

రాజపేట, ప్రజా స్ఫూర్తి : ఈనెల 31వ, తేదీ వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని కోఆర్డినేటర్ కె. మనోజ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులకు వివరాలు చెబుతూ మధ్యలో బడి మానేసిన యువతి యువకులు నేరుగా పదవ తరగతి పరీక్షలు రాసేందుకు ఇంటర్ పూర్తి చేసేందుకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఈ అవకాశాన్ని కల్పిస్తుందని వివరించారు ఇందులో భాగంగా మండల పరిధిలోని ఎస్ ఎస్ ఎన్ ఎమ్ జిల్లా పరిషత్ రఘునాథపురం పాఠశాలలో స్టడీ సెంటర్ పది, ఇంటర్ పూర్తి చేయుటకు ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ మనోజ్ కుమార్ వివరించారు అర్హత గల ఉత్సాహవంతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రవేశాల కోసం ఈనెల 31వ, తేదీ ఆఖరి తేదీ అని వివరించారు. దరఖాస్తుదారులు జనన ధ్రువీకరణ, ఆధార్ జిరాక్స్, రెండు ఫోటోలు అవసరమని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ మనోజ్ కుమార్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ కే. సత్యనారాయణలు తెలిపారు వివరాల కోసం 9010238791, 9912054799 లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెచ్చి చెప్పారు.

## కష్టపడితే సాధించలేనిది ఏమి లేదు

*** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మను చౌదరి**



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : కష్టపడితే సాధించలేనిది ఏమి లేదని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మను చౌదరి విద్యార్థులకు భోధించారు. బుధవారం మల్కాజిగిరి మండలంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజిని జిల్లా అదనపు కలెక్టరురాధిక గుప్తాతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టరు . కాలేజీకి అవసరమైన మౌళిక వసతుల గురించి , కాలేజీలో మొత్తం ఎంత మంది విద్యార్థులు ఉన్నారని కాలేజీ ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. కాలేజీకి ఏమి కావాలని అడుగగా అదనపు తరగతి గదులు, వాష్ రూమ్స్, ఫర్నిచరు, కంప్యూటర్లు, ల్యాబ్ అవసరమని ప్రన్సిపల్ తెలుపగా,వీటన్నింటికి అవసరమైన ఎస్టిమేషన్స్ వేసి నివేదికలు పంపాలని కలెక్టరు సూచించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటిస్తూ ప్రిన్సిపల్ అడిగినవి కాకుండా ఇంకేమైన మీకు సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను కలెక్టరు అడిగారు. విద్యార్థులు సమాధానమిస్తూ స్పోర్ట్స్, క్యాంటీన్,రవాణా సౌకర్యం కావాలన్నారు. విద్యార్థులకు అవసరమైనవి సమకూరుస్తామని కలెక్టరు హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని గమ్యం వైపు చూడాలి కాని మార్గంలోని కష్టాలకు భయ పడకూడదన్నారు



## వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్త రూపం దాల్చాయి

*** తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి**



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి ) : వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్త రూపం దాల్చాయని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ భవనంలో రంగారెడ్డి జిల్లా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు నిర్వహిస్తున్న రెండు రోజులపాటు శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిజంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా రంగం సాంకేతికతతో వేగంగా వార్తల సేకరణ సులభం అవుతుంది తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ సంపాదకులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు మీడియా ధోరణులు, ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సోషల్ మీడియా యూట్యూబ్ లో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజల్లో వెళ్తున్నాయని తెలిపారు.సీనియర్ జర్నలిస్ట్ ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఫేక్ న్యూస్, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా, ఫ్యాక్టు చెక్, మొదలగునవి టెక్నికల్ గా ఏలా ఉపయోగించాలో జర్నలిస్టులకు సవివరంగా తెలియజేశారు. సీనియర్ జర్నలిస్ట్ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ, నేర వార్తల సేకరణ లో తీసుకోవలసిన జాగ్రత్తలు, చట్టాలపై అవగాహన ఉండాలని, వార్తలు సేకరించే ముందు నిజనిర్ధారణ చేసుకొని చేసుకుని వ్రాయాలని ఆయన సూచించారు, అలాగే నేర వార్తలలో చేయాల్సినవి చేయకూడనివి అంశాలపై క్లుప్తంగా వివరించారు.సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డి మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం 2005 గురించి సమగ్రంగా వివరించి జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర రావు,ఐజేయూ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి,టీయూడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు సలీమ్ పాషా,కార్యదర్శి మేకల సత్యనారాయణ, రంగారెడ్డి జిల్లా డిపిఆర్ఓ పి.సి. వెంకటేశం, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ఎంపీ చామల జన్మదిన వేడుకలు



యాదాద్రి భువనగిరి, ప్రజా స్ఫూర్తి: భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుట్ట శివకుమార్ ఆధ్వర్యంలో ఘనంగానిర్వహించారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ని బస్టాండ్ లో ప్రయాణికులకు పండ్లు, బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పనిచేసే ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. భువనగిరి పార్లమెంట్ అభివృద్ధి కి ఎంతో కృషి చేస్తున్నారని అందులో భాగంగా ఘట్కేసర్ నుండి యాదగిరిగుట్టకు ఎంఎంటీ ఎస్ కు నిధులు మంజూరు అయిందని అన్నారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా లక్ష్యం

యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : రేవంత్ రెడ్డి నాయకత్వంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా లక్ష్యమని తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయిన రెండో రోజే సోనియా గాంధీ పుట్టిన రోజున ప్రారంభించిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా ఇప్పటివరకు 200 కోట్ల ప్రయాణాలు పూర్తయ్యాయి. దీని ద్వారా రాష్ట్ర మహిళలు మొత్తం ₹6,680 కోట్లు ఆదా చేసుకున్నారు.ఈ సందర్భంగా టీజీఎస్ఆర్ టి సి నిర్వహించిన వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట రెడ్డి తో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ మహిళలు రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లాలన్నా ఉచితంగా ప్రయాణించగలుగుతున్నారు.నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చాం. బస్సులను అద్దెకు ఇవ్వడం, పెట్రోల్ బంకులు మంజూరు చేయడం ద్వారా మహిళలకు ఆర్థికంగా నిలదొక్కుకునే మార్గం కల్పిస్తున్నాం.ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి మహిళలను యజమానులుగా చేసిన ఘనత కూడా మా ప్రభుత్వానికి చెందుతుంది.మహాలక్ష్మి ఉచిత బస్సు పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ఆర్టీసీ కార్మికులు, అధికారులు, యాజమాన్యానికి హృదయపూర్వక అభినందనలు.ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్న ప్రతి మహిళకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా లక్ష్యంమన్నారు.

## అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా ని కలిసిన డా. రేఖా బోయలపల్లి



యాదాద్రి భువనగిరి, ప్రజా స్ఫూర్తి : ఇంద్రా భవన్, ఢిల్లీలో ఇంద్రా భవన్ లో రేఖా బోయలపల్లి అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డా. రేఖా బోయలపల్లి మాట్లాడుతూ అల్కా లాంబా ఒక మహిళా నాయకురాలిగా కాకుండా, మహిళల కోసం పోరాడుతున్న ఓ ఉద్యమంగా నిలిచారు. ఆమె ఆత్మవిశ్వాసం, ప్రగతిశీల దృక్పథం, మహిళా సాధికారతపై చూపుతున్న నిబద్ధత ఎంతో ప్రేరణ కలిగించే అంశాలు. ఇలాంటి శక్తివంతమైన నాయకురాలను ప్రత్యక్షంగా కలవడం నాకు గర్వంగా ఉంది. మహిలా కాంగ్రెస్ బలోపేతానికి ఆమె మార్గదర్శనం ముఖ్య పాత్ర పోషిస్తుంది" అని పేర్కొన్నారు. ఈ సమావేశం మహిళా కాంగ్రెస్ విస్తరణ, బూత్ స్థాయి కార్యకర్తల శక్తికరణ, రాబోయే ఉద్యమాలపై చర్చలకు దోహదపడింది.

# విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పుల కోసం నిరంతరం కృషి

రాజపేట, (ప్రజా స్ఫూర్తి) : విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పుల కోసం నిరంతరం కృషి చేయనున్నట్లు, వచ్చే ఏడాది మరిన్ని సేవా కార్యక్రమాలను ఆలేరు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్@ తీన్మార్ మల్లన్న తెలిపారు. బుధవారం రాజపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంఈఓ చందా రమేష్ అధ్యక్షత వహించగా తన కూతురు చింతపండు సక్వాల్ పటేల్ జన్మదిన పురస్కరించుకొని మండలంలోని 13 ఉన్నత 23 ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల 2700 మందికి ఉచితంగా బూట్లు, సాక్స్ పంపిణీ కార్యక్రమాన్ని తీన్మార్ మల్లన్న చేపట్టిన సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఓటర్లు కాకపోవడంతో నాయకులు ప్రత్యేక శ్రద్ధ విద్యార్థులపై చూపరని, తాను కూడా రాజకీయం చేసే సమయంలోనే రాజకీయం చేస్తానని చెప్పారు. కార్పొరేట్ విద్యార్థులను తలదన్నే రీతిలో వచ్చే ఏడాది ఆలేరు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు తగు సహకారం అందించనున్నట్లు తీన్మార్ మల్లన్న హామీ ఇచ్చారు. ఢిల్లీ, స్ప్రింగ్ ల్యాండ్లలోని విద్యాలయాల పరిశీలన నిమిత్తం ముఖ్యమంత్రిని అనుమతి కోరినట్లు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. సిస్టంను మార్చేందుకే రాజకీయాల్లోకి వచ్చినట్లు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని 8,9, 10 తరగతి విద్యార్థులకు నెలకు ఒకసారి పోలీసు, వ్యవసాయ, రెవెన్యూ లాంటి ఇతర శాఖల అధికారులచే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు విద్యా వ్యవస్థ విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల కంటే ఎన్నోరెట్లు మెరుగు అన్నారు. తాను జర్నలిస్టుగా ఉన్న సమయంలో ప్రైవేటు విద్యాలయాల ఆగడాలు, మోసాలను గుర్తించి బహిర్గతం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా వివరించారు. గత సంవత్సరం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల్లో నోటు పుస్తకాలు అందించినట్లు ఈసారి ఆలేరు




నియోజకవర్గం లోని అన్ని మండలాలలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులందరికీ బూట్లు, సాక్స్ అందజేస్తున్నట్లు ఆయన చెప్పారు. తన సొంత గ్రామం మాదాపురంలో గతంలో ప్రో కబడ్డీ ని సుమారు 30 లక్షల రూపాయలతో నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తుచేసి విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసినట్లు తీన్మార్ మల్లన్న చెప్పారు. లక్ష్యాలు నెరవేరే విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ముందుకు సాగాలని ఆయన విద్యార్థులను కోరారు. చదువుతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని మల్లన్న చెప్పారు. జిల్లా విద్యాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని కొనియాడారు. గతంలో కంటే ఈ ఏడాది అధిక సంఖ్యలో ప్రైవేటు విద్యాసంస్థల నుండి విద్యార్థుల ప్రభుత్వ పాఠశాలలో చేరిన డి.ఈ.ఓ గుర్తు చేశారు. జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఘనత తనది కాదని ఉపాధ్యాయులదేనని డీఈవో చెప్పారు. తీన్మార్ మల్లన్న ప్రోత్సాహాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు లక్ష్యసాధన దిశగా పయనించాలన్నారు. ఎంఈఓ చందా రమేష్ మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని విద్యార్థుల పక్షాన కృతజ్ఞతలు చెప్పారు. ఎమ్మెల్సీ, క్యూ న్యూస్ ద్వారా విద్యాభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్నను ఎంఈఓ చందా రమేష్ గుప్త ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. మహిళా టీచర్లు చేనేత శాలులతో సత్కరించి కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, శశికుమార్ శోభా, ప్రభాకర్, వసంత విజయలక్ష్మి, కోటిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మనోజ్ కుమార్, రవీందర్ రెడ్డి,కిరణ్ శ్రీనివాసులు, నమిల భరత్ కుమార్ గౌడ్, వివిధ ఉపాధ్యాయ సంఘం బాధ్యులు తపస్ అధ్యక్షులు జానయ్య, పిఆర్టియు అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు. తీన్మార్ మల్లన్న ను ముందుగా విద్యార్థులు ప్రత్యేకంగా నృత్యం చేస్తూ ఘనంగా స్వాగతం పలికారు.

## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

* ఎస్పీ రోహిత్ రాజు



ప్రజా స్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం:ఎడతెరిపి లేకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాల వలన జిల్లాలోని నదులు, వాగులు, వంకలు,చెరువులు పొంగి ఉదృతంగా ప్రవహిస్తూ రోడ్లపైకి నీరు చేరే అవకాశం ఉన్నది. కావున కాలి నడకన మరియు వాహనాలతో ప్రజలు రోడ్లు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు.సెల్ఫీల కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని తెలిపారు. నదులు, వాగులు, వంకల వద్దకు జాలర్లు, ప్రజలు చేపల వేటకు వెళ్ళకూడదని సూచించారు. పశువులను కాయడానికి నదులు,వాగులు,వంకల పరిసర ప్రాంతాల దగ్గరకు వెళ్లకూడదని సూచించారు. సాధ్యమైనంత వరకు అత్యవసర సమయాల్లో తప్ప మిగిలిన సమయాలలో బయటకు రాకుండా ఉండడానికి ప్రయత్నించవలసిందిగా సూచించారు.జిల్లా పోలీసు యంత్రాంగం ఇతర శాఖలతో కలిసి ఇప్పటికే వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారుతున్న రహదారులు , చెరువులు,వాగులు,నదుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలియజేసారు.వరదల్లో చిక్కుకుని ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి జిల్లా పోలీస్ శాఖ తరపున 24గంటలు అందుబాటులో ఉండే విధంగా డిడిఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచడం జరిగిందని తెలిపారు.ప్రజలు ఎవరైనా విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లయితే వెంటనే డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం అందించి పోలీసు వారి సేవలను పొందాలని కోరారు.ప్రమాదాలు వాటిల్లకుండా పోలీసు వారు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.




## డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన వ్యక్తి రిమాండ్

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇప్పిస్తానని భాధితుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడిన ఓ వ్యక్తిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. బుధవారం జీడిమెట్ల పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, జీడిమెట్ల సిఐ గంధం మల్లేష్లు వివరాలను వెల్లడించారు. కుత్బుల్లాపూర్ రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న బోడిమిశెట్టి హరిబాబు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ చింతల్ క్యాంపు కార్యాలయంలో అసిస్టెంట్గా పని చేస్తుండే వారు. అయితే ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం కింద డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇప్పిస్తానంటూ పేదల వద్ద రూ.లక్ష లు వసూలు చేశాడు. అయితే ఇచ్చిన డబ్బులు ఇవ్వకపోగా డబుల్ బెడ్ రూం ఇండ్లు కూడా ఇవ్వలేదు. దీంతో గిరినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు తైలం రమేష్ జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించి ఈ నెల 14న ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు



నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో మరో 83 మంది వ్యక్తుల నుంచి ఒక్కో వ్యక్తి నుంచి లక్ష రూపాయాలు వసూలు చేశారని, 8 మంది భాధితుల వాగ్మూలాలను పోలీసులు సేకరించారు. డబ్బులు ఇస్తున్న దృశ్యాలను వీడియో ఆధారాలను సేకరించారు. ఈ మేరకు పోలీసులు బుధవారం అతనిని అదుపులోకి తీసుకుని రిమాండ్కు తరలించారు. ఈ సమావేశంలో డీఐ కనకయ్య, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

## భవితా కేంద్రాన్ని సందర్శించిన విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం లోని భవితా కేంద్రాన్ని సందర్శించి, దివ్యాంగ పిల్లలతో, వారి తల్లిదండ్రులతో ఇంటర్ యాక్ట్ అయిన విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా మాట్లాడుతూ, దివ్యాంగ పిల్లలకు అందవలసిన సదుపాయాలన్నీ పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. ముఖ్యంగా భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల యొక్క కౌశలాలను అభివృద్ధి పరచుకొని, సాధారణ విద్యార్థులతో సమానంగా విద్యను అభ్యసించే విధంగా ఈ భవిత కేంద్రాలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు.దివ్యాంగ పిల్లలందరికీ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమం లో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలాస్ , ఉన్నత విద్యాశాఖ కమీషనర్ దేవసేన , జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్,అసిస్టెంట్ కలెక్టర్ సౌరబ్ శర్మ, రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్స్ రాజీవ్ , మదన్ మోహన్ , ఆర్జెడి సత్యనారాయణ రెడ్డి , జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకటేశ్వర చారి , జిల్లా కోఆర్డినేటర్ లు నాగరాజ శేఖర్, సైదులు, సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యరాజ్య సమితిలో పాకిస్థాన్‌పై విరుచుకుపడిన భారత్




* **పాకిస్థాన్ మతోన్మాదం, ఉగ్రవాదంలో కూరుకుపోయిందన్న భారత్**
* **ఐఎంఎఫ్ నుంచి పదేపదే రుణాలు తీసుకుంటోందని ఎద్దేవా**
* **భారత్, పాకిస్థాన్ మధ్య వైరుధ్యాన్ని స్పష్టంగా చెప్పిన భారత రాయబారి**

ఐక్యరాజ్యసమితి (యూఎన్) వేదికగా పాకిస్థాన్‌పై భారత్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. పాకిస్థాన్‌ను "మతోన్మాదం, ఉగ్రవాదంలో కూరుకుపోయిన, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి సీరియల్ రుణగ్రహీత"గా అభివర్ణించింది. అంతర్జాతీయ శాంతి, భద్రతను ప్రోత్సహించడం, ద్వైపాక్షిక చర్చల ద్వారా వివాదాల పరిష్కారం అనే అంశంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ) లో జరిగిన ఉన్నత స్థాయి బహిరంగ చర్చలో భారత్ శాశ్వత ప్రతినిధి, రాయబారి పర్వతనేని హరీశ్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు.

**భారత్-పాక్ మధ్య వ్యత్యాసం**

భారత్‌పాక్ దేశాల మధ్య ఉన్న వైరుధ్యాన్ని హరీశ్ స్పష్టంగా ఎత్తిచూపారు. "ఒకవైపు భారతదేశం ఉంది.. పరిణితి చెందిన ప్రజాస్వామ్యం, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ, బహుళ సాంస్కృతిక, సమ్మిళిత సమాజం. మరోవైపు పాకిస్థాన్ ఉంది.. మతోన్మాదం, ఉగ్రవాదంలో మునిగి, ఐఎంఎఫ్ నుంచి పదేపదే రుణాలు తీసుకునే దేశం" అని దుయ్యబట్టారు. ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ అనే ప్రాథమిక సూత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా గౌరవించాలని ఆయన పిలుపునిచ్చారు. అయితే, పాకిస్థాన్ అంతర్జాతీయ సమాజానికి ఆమోదయోగ్యం కాని పద్ధతుల్లో పాల్గొంటోందని, "అంతర్జాతీయ శాంతి, భద్రతను చర్చిస్తున్నప్పుడు పాకిస్థాన్ వంటి దేశం ఉపన్యాసాలు ఇవ్వడం సమంజసం కాదు" అని ఆయన తీవ్రంగా విమర్శించారు.

* **పహల్గామ్ దాడి.. 'ఆపరేషన్ సిందూర్' ప్రస్తావన**

ఈ సందర్భంగా, హరీశ్ ఏప్రిల్ 22 న జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని గుర్తు చేశారు. ఈ దాడిలో 26 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారని, ఈ దాడికి ప్రతిస్పందనగా భారతదేశం 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించిందని పేర్కొన్నారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుందని హరీశ్ వివరించారు. ఈ ఆపరేషన్ తన ప్రాథమిక లక్ష్యాలను సాధించిన తర్వాత, పాకిస్థాన్ అభ్యర్థన మేరకు సైనిక కార్యకలాపాలను నిలిపివేశామని ఆయన వెల్లడించారు.

## భారత్ కీలక నిర్ణయం... చైనా పౌరులకు మళ్లీ పర్యాటక వీసాలు జారీ

* **2020లో గాల్వన్ లోయ వద్ద భారత్-చైనా బలగాల ఘర్షణలు**
* **చైనా టూరిస్టులకు వీసాలు నిలిపివేసిన భారత్**
* **ఇటీవల కాలంలో సత్ఫలితాలు ఇస్తున్న చర్చలు**
* **చైనా పౌరులకు టూరిస్టు వీసాలు జారీ చేయాలని భారత్ నిర్ణయం**



గాల్వన్ వద్ద 2020లో జరిగిన సరిహద్దు ఘర్షణల తర్వాత చైనా పౌరులకు పర్యాటక వీసాలను భారత్ నిలిపివేయడం తెలిసిందే. అయితే, గత కొంతకాలంగా చైనా వైఖరిలో మార్పు వచ్చింది. భారత్‌చైనా మధ్య పలు చర్చలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో, కీలక పరిణామం చోటుచేసుకుంది. చైనా పర్యాటకులకు తిరిగి వీసాలు మంజూరు చేయాలని భారత్ నిర్ణయించింది. ఈ నిర్ణయం జూలై 24 నుంచి అమలులోకి వస్తుందని చైనాలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. సరిహద్దు వివాదాలు, వాణిజ్య ఉద్రిక్తతల కారణంగా దెబ్బతిన్న సంబంధాలను మెరుగుపరచడం దీని లక్ష్యం. గాల్వాన్ ఘర్షణల తర్వాత భారత్ చైనా పెట్టుబడులు, యాప్‌లపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఏర్పడిన దౌత్యపరమైన స్తంభన తర్వాత ఈ నిర్ణయం వెలువడింది. 2022లో భారతీయ విద్యార్థులకు, వ్యాపార యాత్రికులకు చైనా వీసాలను తిరిగి ప్రారంభించినప్పటికీ, భారత్ మాత్రం చైనా పౌరులకు పర్యాటక వీసాల జారీని ఇప్పటివరకు నిలిపి ఉంచింది. తాజాగా, భారత్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని చైనా స్వాగతించింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మాట్లాడుతూ, నిరంతర చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య జరిగిన ఉన్నత స్థాయి సమావేశాలతో దౌత్యపరమైన వాతావరణం మెరుగుపడుతున్న సంకేతాలు ఉన్నప్పటికీ... 3,800 కిలోమీటర్ల వివాదాస్పద సరిహద్దు సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. ఇరుదేశాల సంబంధాలు పూర్తిస్థాయిలో సాధారణ స్థితికి రావాలంటే.... సైనిక ప్రతిష్టంభనను పరిష్కరించడం, వాణిజ్య ఆంక్షలను ఎత్తివేయడం అవసరమని భారత విదేశాంగ మంత్రి నొక్కి చెప్పారు.

## ట్రంప్ వ్యాఖ్యలపై మరోసారి కేంద్రానికి రాహుల్ గాంధీ ప్రశ్న

* **ట్రంప్ కాల్పుల విరమణ చేయించారని కేంద్రం చెబుతుందా? అని వ్యాఖ్య**
* **కేంద్ర ప్రభుత్వం అలా చెప్పదు.. కానీ అదే నిజమన్న రాహుల్ గాంధీ**
* **కాల్పుల విరమణ చేయించినట్లు 25 సార్లు ట్రంప్ చెప్పారని వ్యాఖ్య**



భారత్ పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు తానే ఒప్పించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటివరకు పాతికసార్లు చెప్పారని, దీనిపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పార్లమెంటు ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేవలం కాల్పుల విరమణ మాత్రమే కాదని, చర్చించాల్సిన అంశాలు చాలా ఉన్నాయని అన్నారు. "కేంద్రం ఏమని చెబుతుంది? ట్రంప్ కాల్పుల విరమణ చేయించారని చెబుతుందా? కానీ అలా చెప్పలేరు. అయితే అదే నిజం. ఇది కేవలం కాల్పుల విరమణ వరకే కాదు, మనం చర్చించాల్సిన చాలా పెద్ద సమస్యలు ఉన్నాయి. కాల్పుల విరమణ చేయించినట్లు 25 సార్లు ట్రంప్ చెప్పారు. అసలు ట్రంప్ ఎవరు? అది ఆయన పని కాదు కదా, ప్రధానమంత్రి సమాధానం ఇవ్వడం లేదు" అని రాహుల్ గాంధీ అన్నారు. భారత్‌పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పించామని మంగళవారం కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అన్నారు. ఈ ఘర్షణలో ఐదు విమానాలు కూలిపోయినట్లు చెప్పారు. కాకపోతే, ఏ దేశానివో మాత్రం వెల్లడించలేదు. ఈ ఘర్షణ అణుయుద్ధం వరకు వెళ్లలేదని అన్నారు.

# యాదగిరిగుట్ట 41 రోజుల ఆదాయం ఎంతంటే? 12 దేశాల కరెన్సీలు సమర్పించిన భక్తులు

* నగదు, కానుకలను లెక్కించిన ఆలయ సిబ్బంది
* రూ. 2,45,48,023 నగదు సమకూరినట్లు వెల్లడించిన ఈవో
* స్వామి వారికి బంగారం, వెండి సమర్పించిన భక్తులు



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గత 41 రోజులుగా భక్తులు సమర్పించిన నగదు, నగల కానుకలను బుధవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. రూ. 2,45,48,023 నగదు సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకట్రావు వెల్లడించారు. దీంతో పాటు 38 గ్రాముల బంగారం, 2,800 గ్రాముల వెండి, వివిధ దేశాల కరెన్సీలు హుండీ ఆదాయం ద్వారా సమకూరినట్లు తెలిపారు. విదేశీ కరెన్సీ విషయానికి వస్తే అమెరికా 1036 డాలర్లు, ఆస్ట్రేలియా 5 డాలర్లు, ఇంగ్లండ్ 45 పౌండ్లు, సౌదీ అరేబియా 5 రియాల్, సింగపూర్ 10 డాలర్లు, మలేసియా 23 రింగిట్స్, కెనడా 20 డాలర్లు, ఒమన్ 500 బైస, అరబ్ ఎమిరేట్స్ 70 దీరమ్స్‌తో సహా 12 దేశాల కరెన్సీలు లక్ష్మీనరసింహస్వామి వారికి సమర్పించారు.

## తెలంగాణలో ఆరుగురు ఐఏఎస్ లకు సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్

* 2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారులకు పోస్టింగ్
* ఆరుగురికి సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు
* నారాయణఖేడ్ సబ్ కలెక్టర్‌గా ఉమాహారతి

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారులకు సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఆరుగురు ఐఏఎస్ అధికారులకు సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్ ఇచ్చారు. నారాయణఖేడ్ సబ్ కలెక్టర్‌గా ఉమాహారతి, భైంసాకు అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్మూర్‌కు అభిజ్ఞాన్ మాల్వియా, కల్లూరుకు అజయ్ యాదవ్, భద్రాచలానికి మృణాళ్ శ్రేష్ఠ, బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా మనోజ్‌ను నియమిస్తూ సీఎస్ రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు.



## బొగత జలపాతం మూసివేత.. అటవీశాఖ నిర్ణయం

హైదరాబాద్: ములుగు జిల్లాలోని వాజేడులో కుండపోత వర్షాలతో బొగత జలపాతం పరవళ్లు తొక్కుతోంది. ఈ నేపథ్యంలో పర్యటకుల భద్రత దృష్ట్యా ఈ జలపాతాన్ని తాత్కాలికంగా మూసివేయాలని తెలంగాణ అటవీశాఖ నిర్ణయించింది. ఈ నెల 26 వరకు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఈ జలపాతం మూసిఉంటుందని ములుగు జిల్లా ఫారెస్ట్ అధికారి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఇప్పటికే అప్రమత్తమైన అధికారులు.. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. సందర్శకులను అనుమతించడంలేదు. మరోవైపు, ముత్యందార, కొంగల, మామిడిలొద్ది, కృష్ణాపురం జలపాతాలను సైతం శాశ్వతంగా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. పర్యటకులను ఆయా జలపాతాల వద్దకు అనుమతించబోమని తెలిపారు. ఎవరైనా తమ సూచలను ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని, పోలీసు కేసు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

## డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని మోసం.. వ్యక్తి అరెస్టు

హైదరాబాద్: డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన ఓ వ్యక్తిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు హరిబాబు గతంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద క్యాంప్ ఆఫీసులో అసిస్టెంట్‌గా పనిచేశాడు. ప్రభుత్వ గృహనిర్మాణ పథకం కింద డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని గిరినగర్‌కు చెందిన రమేశ్ వద్ద రూ.లక్ష నగదు తీసుకున్నాడు. ఇల్లు ఇప్పించకపోగా.. డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడు. ఇదే విధంగా దాదాపు 83 మంది వద్ద కూడా రూ.లక్ష చొప్పున తీసుకొని మోసం చేశాడని పోలీసులకు రమేశ్ ఫిర్యాదు చేశాడు. వసూలు చేసిన డబ్బుతో హరిబాబు కుత్బుల్లాపూర్‌లోని రెడ్డినగర్ కాలనీలో ఇల్లు నిర్మించుకొని ప్రస్తుతం అక్కడే నివసిస్తున్నట్లు పేర్కొన్నాడు. రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న



పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. ఎనిమిది మంది బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసి, వీడియో ఆధారాలను సేకరించారు. వాటిలో ఒక బాధితుడు హరిబాబుకు డబ్బులు అందజేసే దృశ్యాలు కూడా ఉన్నాయి. దీంతో పోలీసులు నిందితుడిని బుధవారం అరెస్టు చేశారు. మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

## ఇంజినీరింగ్ తొలి దశ కౌన్సిలింగ్ పూర్తి.. 59,980 మంది సెల్ఫ్ రిపోర్టింగ్



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎప్‌సెట్ 2025కు సంబంధించి ఇంజినీరింగ్ మొదటి దశ అడ్మిషన్ కౌన్సిలింగ్ పూర్తయింది. తొలి దశలో ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీలు, కళాశాలల్లో మొత్తం 94,059 సీట్లకుగానూ.. 77,561 మందికి సీట్లు కేటాయించారు. అయితే, 59,980 మంది మాత్రమే ఆయా విద్యాసంస్థల్లో సెల్ఫ్ రిపోర్ట్ చేశారు. రెండో దశ కౌన్సిలింగ్ ఈనెల 26 నుంచి ప్రారంభంకానుంది. 26న సర్టిఫికెట్ వెరిఫికేషన్, 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యా మండలి వెల్లడించింది.

## కంచగచ్చిబౌలిలో చెట్ల నరికివేతపై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసిన సుప్రీంకోర్టు

* నరికిన చెట్ల స్థానంలో మొక్కలు పెంచాలన్న కోర్టు
* పర్యావరణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశం
* నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అధికారులను జైలుకు పంపిస్తామని హెచ్చరిక



కంచగచ్చిబౌలిలో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు ఈరోజు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసింది. నరికిన చెట్ల స్థానంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పునరుద్ధరించాలని అధికారులకు సూచించింది. లేదంటే అధికారులను జైలుకు పంపిస్తామని మరోమారు హెచ్చరించింది. ఈ మేరకు హెచ్ సీయూ సమీపంలోని కంచగచ్చిబౌలి భూముల వివాదంపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ భూమిలో పర్యావరణ పునరుద్ధరణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం మంగళవారం దాఖలు చేసిన అఫిడవిట్ ను ధర్మాసనం పరిశీలించింది. గత విచారణలో ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టినట్లు తెలిపింది. కంచగచ్చిబౌలి భూముల్లో పనులు నిలిపివేసి పర్యావరణ పునరుద్ధరణకు కృషి చేస్తున్నట్లు అఫిడవిట్ లో పేర్కొంది. ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్ ను పరిశీలించడానికి సమయం కావాలని అమికస్ క్యూరీ కోరడంతో సుప్రీం ధర్మాసనం విచారణను ఆగస్టు 13కు వాయిదా వేసింది. కంచగచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిలో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. గత విచారణలో సీజేఐ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్ల నరికివేతను వెంటనే నిలిపివేసి, నరికిన చెట్ల స్థానంలో మొక్కల పెంపకం చేపట్టాలని ఆదేశించింది. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా ఉన్నతాధికారులంతా జైలుకు వెళ్లాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించింది. కంచగచ్చిబౌలి అటవీ ప్రాంతంలోనే ప్రత్యేకంగా జైలు నిర్మించి అధికారులను అందులోనే ఖైదు చేయాలని పోలీస్ శాఖను ఆదేశిస్తామని వ్యాఖ్యానించింది. పర్యావరణ పునరుద్ధరణకు చర్యలు చేపట్టి, పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు తీసుకున్న చర్యలను కోర్టుకు తెలియజేయాలంటూ విచారణను వాయిదా వేసింది. తాజాగా ఈరోజు కంచగచ్చిబౌలి భూముల కేసును విచారించింది.

## సాధ్యం కానప్పుడు.. రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఎలా అంగీకరించారు?

**: మహేశ్‌కుమార్ గౌడ్**

హైదరాబాద్: భాజపా, భారత రాష్ట్ర సమితి పార్టీలు బీసీలకు వ్యతిరేకమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చేందుకు చేస్తోన్న ప్రయత్నాలకు భారత రాష్ట్ర సమితి మోకాలడ్డుతోందని విమర్శించారు. బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. తాము పంపిన బీసీ రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు భాజపా ససేమిరా అంటోందని.. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఆ పార్టీకి ఇష్టం లేనట్లుగా ఉందన్నారు. "బీసీ



రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చడం ఎందుకు సాధ్యం కాదు? అలాంటప్పుడు అసెంబ్లీలో భాజపా ఎమ్మెల్యేలు ఎందుకు అంగీకరించారు? బిల్లు ప్రతిపాదన దిల్లీకి చేరేసరికి ఎందుకు మాట మారుస్తున్నారు? భాజపా జాతీయ నాయకత్వం.. తమ అభిప్రాయాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి నోటితో పలికిస్తూ పలాయనం చిత్తగిస్తోంది. బీసీ బిల్లు కోసం పార్లమెంట్‌ను స్తంభింపజేస్తాం. ఈ నెల 25న జరగనున్న ఓబీసీల సదస్సులో రాహుల్ గాంధీ బీసీ గొంతుకై నిలవబోతున్నారు. బీసీ వ్యతిరేక పార్టీలైన భాజపా, భారత రాష్ట్ర సమితి నుంచి బీసీలంతా బయటకు రావాలి"అని మహేశ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

## రూ.69లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నాం: సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్: నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న 9 మందిని హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కొకైన్ సరఫరా చేస్తున్న ఆరుగురు, మెఫిడ్రీన్ సరఫరా చేస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 286 గ్రాముల కొకైన్, 11 గ్రాముల ఎక్స్‌టసీ, తుపాకీ, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ కేసు వివరాలను సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. "డగ్స్ కేసులో రవివర్మ, సచిన్ అనే ఇద్దరు కీలక వ్యక్తులను పట్టుకుని వారి నుంచి ముఖ్యమైన సమాచారం సేకరించాం. రవివర్మకు ముంబయికి చెందిన ముఠాతో సంబంధాలున్నాయి. అక్కడ ఉన్న వాహిద్ అనే వ్యక్తికి విదేశాల నుంచి కొకైన్ వస్తోంది. అతడి నుంచి నిందితులు హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొస్తున్నారు. ప్రేమ్ ఉపాధ్యాయ్ అనే వినియోగదారుడిని అరెస్ట్ చేయడంతో ఈ ముఠా గుట్టురట్టయింది. నిందితుల నుంచి రూ.69లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నాం. కాటేదాన్‌లో డ్రగ్స్ దందా చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన పవన్ భాటీని కూడా అరెస్ట్ చేశాం. హేమ్‌సింగ్ అనే మరో వ్యక్తితో కలిసి పవన్ భాటీ డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. నిందితులు ముందు జాగ్రత్తగా రివాల్వర్, బుల్లెట్లు కూడా కొనుగోలు చేశారు" అని సీపీ వివరించారు.



## మహాలక్ష్మి పథకంతో లాభాల్లోకి తెలంగాణ ఆర్టీసీ: భట్టి విక్రమార్క

హైదరాబాద్: తెలంగాణలో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం తెచ్చినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తయిన సందర్భంగా ఎంజీబీఎస్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం ద్వారా నేడు ఆర్టీసీ లాభాల్లోకి వచ్చిందన్నారు. 200 కోట్ల ప్రయాణాలతో రూ.6 వేల కోట్లు ఆర్జించిందన్నారు. కాంగ్రెస్ హయాంలో ఆర్టీసీ బలోపేతం అవుతోందని పేర్కొన్నారు. ఆక్యుపెన్సీ రేటు ఒకప్పుడు



67 శాతం ఉంటే ఈరోజు 97 శాతానికి వచ్చిందన్నారు. ఆర్టీసీ ఇటీవల వేల సంఖ్యలో కొత్త బస్సులు కొన్నట్లు తెలిపారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఖర్చుకు వెనకాడకుండా ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు.

* **గత పాలకులు ఆర్టీసీని విధ్వంసం చేశారు: మంత్రి పొన్నం**

ఆర్టీసీలో కొత్తగా నియామకాలు జరుగుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల్లోకి వచ్చిందని పేర్కొన్నారు. సంస్థలో పెండింగ్ బకాయిలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలతో బస్సులు కొనుగోలు చేయిస్తున్నామన్నారు. గత పాలకులు పదేళ్లు ఆర్టీసీని విధ్వంసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద.. రెండు గేట్లు ఎత్తి నీరు విడుదల

సున్నిపెంట సర్కిల్: పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జలాశయం రెండు రేడియల్ క్రస్ట్ గేట్లను 10 అడుగుల పైకెత్తి స్పిల్‌వే ద్వారా 55,048 క్యూసెక్కులు.. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 66,948 క్యూసెక్కులను అదనంగా నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఎగువ పరివాహక ప్రాంతాలైన జూరాల నుంచి 39,168, సుంకేసుల జలాశయం నుంచి 36,975 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయానికి 883.80 అడుగులు ఉండగా..నీటి నిల్వ 208 టీఎంసీలుగా నమోదైంది.

# భగ్గుమంటున్న వెండి ధరలు..



న్యూఢిల్లీ: ఒకప్పుడు బంగారానికి ప్రత్యామ్నాయంగా, 'పేదల బంగారం'గా మాత్రమే పేరుగాంచిన వెండి, ఇప్పుడు తన నిజమైన విలువను చాటుకుంటోంది. కోవిడ్ మహమ్మారి ప్రారంభమైన నాటి కనిష్ట స్థాయిల నుంచి వెండి ధరలు ఏకంగా 3.5 రెట్లు పెరిగి, బంగారాన్ని కూడా అధిగమించాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ పెరుగుదల తాత్కాలికం కాదు. దీర్ఘకాలికంగా వెండి ధరల ర్యాలీ కొనసాగే అవకాశం ఉంది. దీనికి ప్రధానంగా ఐదు కారణాలు దోహదపడుతున్నాయి. ఒకప్పుడు "పేదల బంగారం"గా పేరు పొందిన వెండి, ఇప్పుడు దూసుకుపోతోంది. కొవిడ్ కనిష్ట స్థాయిల నుంచి 3.5 రెట్లు పెరిగిన వెండి ధరల వెనుక, పెరుగుతున్న పారిశ్రామిక డిమాండ్, సరఫరా కొరత వంటి ఐదు కీలక కారణాలున్నాయి.

### పారిశ్రామిక డిమాండ్ పెరుగుదల:

ఆధునిక యుగంలో వెండి కేవలం నగలు, నాణేలకు మాత్రమే పరిమితం కాకుండా, ఒక కీలక పారిశ్రామిక లోహంగా మారింది. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ ప్యానెల్స్ తయారీలో వెండి విస్తృతంగా వినియోగించబడుతోంది. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులపై పెరుగుతున్న ఆందోళనలు, పునరుత్పాదక ఇంధన వనరుల పట్ల ఆసక్తి సోలార్ రంగానికి భారీ ఊతం ఇస్తున్నాయి. సోలార్ ప్యానెళ్లలో వెండి ఒక వాహకంగా ఉపయోగపడటంతో పాటు, ఈవీల్లోని అనేక ఎలక్ట్రానిక్ భాగాలలోనూ దీనిని వాడతారు. ఈ రెండు రంగాలు వేగంగా విస్తరిస్తుండటంతో, వెండికి డిమాండ్ ఊహించని విధంగా పెరుగుతోంది.

### సరఫరా కొరత, మైనింగ్ సవాళ్లు:

వెండి ఉత్పత్తికి కొన్ని పరిమితులున్నాయి. ఇది ఎక్కువగా రాగి, సీసం, జింక్ వంటి ఇతర లోహాల తవ్వకాల సమయంలో ఉప-ఉత్పత్తిగా లభిస్తుంది. అందువల్ల, ప్రత్యేకంగా వెండి కోసం గనులను తవ్వడం తక్కువ. ప్రధాన లోహాల ఉత్పత్తి తగ్గితే, వెండి సరఫరా కూడా ప్రభావితమవుతుంది. ప్రస్తుతం ఉన్న గనుల్లో ఉత్పత్తి ఖర్చులు పెరగడం, కొత్త గనుల ఏర్పాటుకు సమయం పట్టడం సరఫరాపై ఒత్తిడిని పెంచుతున్నాయి. పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడం వెండి ధరల పెరుగుదలకు ముఖ్య కారణం.

### ద్రవ్యోల్బణం నుంచి రక్షణ:

చరిత్రలో బంగారం, వెండి ద్రవ్యోల్బణం నుంచి రక్షణ కవచాలుగా పనిచేశాయి. ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు లేదా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పుడు, పెట్టుబడిదారులు తమ సంపదను రక్షించుకోవడానికి భౌతిక ఆస్తుల వైపు మొగ్గు చూపుతారు. వెండి తన విలువను నిలబెట్టుకోవడంలో, కొన్నిసార్లు ద్రవ్యోల్బణాన్ని మించి రాబడులను ఇవ్వడంలో సమర్థతను చూపింది. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో హెచ్చుతగ్గులు కొనసాగుతున్నందున, వెండి ఒక సురక్షితమైన పెట్టుబడిగా ముందుకు సాగుతోంది.

### పెరుగుతున్న రిటైల్ ఇన్వెస్టర్ల ఆసక్తి:

గత కొన్ని సంవత్సరాలుగా సిల్వర్ ఈటీఎఫ్‌లు, వెండి కాయిన్స్, సిల్వర్ బార్స్ కొనుగోలులో రిటైల్, సంస్థాగత పెట్టుబడిదారుల ఆసక్తి బాగా పెరిగింది. పారిశ్రామిక వినియోగం, రిటైల్ వినియోగం రెండూ పెరగడం పెట్టుబడిదారులను ఆకట్టుకుంటోంది.

### బంగారం కంటే అందుబాటు ధర:

'పేదల బంగారం'గా పిలువబడే వెండి, చారిత్రాత్మకంగా బంగారం-వెండి నిష్పత్తి ద్వారా దాని విలువను అంచనా వేస్తారు. ఈ నిష్పత్తి (ఒక ఔన్సు బంగారం కొనడానికి ఎన్ని ఔన్సుల వెండి అవసరం) సాధారణంగా 60-80 మధ్య ఉంటుంది. ఈ నిష్పత్తి 100కి పైగా పెరిగినప్పుడు, వెండి బంగారంతో పోలిస్తే తక్కువ అంచనా వేయబడిందని సూచిస్తుంది. ప్రస్తుతం ఈ నిష్పత్తి చారిత్రక సగటు కంటే ఎక్కువ ఉన్నప్పుడు, వెండి తిరిగి పటిష్టమయ్యే అవకాశం ఉందని సూచిస్తుంది. బంగారం కంటే తక్కువ ధరకు లభ్యం కావడం కూడా చాలా మంది పెట్టుబడిదారులను వెండి కొనుగోళ్ల వైపు ఆకట్టుకుంటోంది.

## అడ్డంగా బుక్కైన మింత్రా..

### రంగంలోకి దిగిన ఈడీ..




**న్యూఢిల్లీ:** ఈ కామర్స్ రంగంలో మింత్రా దూసుకపోతుంది. బట్టలకు సంబంధించి అమెజాన్, ఫ్లిప్ కార్ట్‌లకు గట్టి పోటీనిస్తుంది. అయితే మింత్రాపై ఈడీ కేసు నమోదు చేయడం సంచలనంగా మారింది. రూ.1,654.35 కోట్ల రూపాయల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను ఉల్లంఘించినందుకు మింత్రా తో పాటు దాని అనుబంధ కంపెనీలు, డైరెక్టర్లపై ఈడీ కేసు నమోదు చేసింది. ప్రస్తుతం ఏదీ కొనాలన్న ఆన్‌లైన్‌లోనే. బట్టల నుంచి ప్రతి చిన్న వస్తువు వరకు ఇంట్లోనే బుక్ చేయడం కామన్‌గా మారింది. ప్రజల అవసరాలకు తగ్గట్లుగా ఇప్పటికే ఎన్నో ఈ కామర్స్ సైట్లు పుట్టుకొచ్చాయి. అమెజాన్, ఫ్లిప్ కార్ట్, మింత్రా వంటి యాప్స్ ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. గత కొంత కాలంగా బట్టలకు సంబంధించి మింత్రా దూసుకపోతుంది. బట్టలు అనగానే నెటిజన్స్ ఎక్కువగా ఈ యాప్‌నే యూజ్ చేస్తున్నారు. దీంతో ఫ్లిప్ కార్ట్, అమెజాన్ వంటి వాటికి గట్టి పోటీ ఇస్తుంది. ఈ క్రమంలో మింత్రాపై ఈడీ కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. మింత్రా ఫెమా ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఈడీ ఆరోపిస్తుంది. రూ.1,654.35 కోట్ల రూపాయల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను ఉల్లంఘించినందుకు మింత్రాతో పాటు దాని అనుబంధ కంపెనీలు, డైరెక్టర్లపై ఈడీ కేసు నమోదు చేసింది. మింత్రా డిజైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎఫ్‌డీఐ నిబంధనలను ఉల్లంఘించి.. మల్టీ బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్ నిర్వహిస్తున్నట్లు ఈడీ చెబుతోంది. విశ్వసనీయ సమాచారం ఆధారంగా బెంగళూరు జోనల్ కార్యాలయంలో కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు సంస్థ తెలిపింది.

హోల్‌సేల్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నామనే కారణంతో మింత్రా రూ.1654.35 కోట్ల విలువైన ఎఫ్‌డీఐని అందుకున్నట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. అయితే ఎక్కువ ఉత్పత్తులను వెక్టర్ ఈ-కామర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మింత్రా విక్రయించింది. ఆ తర్వాత వెక్టర్ కస్టమర్లకు అమ్మింది. ఇక్కడ వెక్టర్ కూడా మింత్రా అనుబంధ సంస్థ కావడం గమనార్హం. నిబంధనల ప్రకారం.. హోల్‌సేల్ మోడల్ కింద పనిచేసే కంపెనీలు తమ వస్తువులలో 25శాతం వరకు మాత్రమే తమ అనుబంధ సంస్థలకు విక్రయించొచ్చు. మింత్రా మాత్రం తన అమ్మకాలలో 100శాతం వెక్టర్ ఇ-కామర్స్‌కు అమ్మేసింది. ఒకే గ్రూప్‌కు చెందిన సంస్థకు 100శాతం విక్రయాలు జరిపి.. మింత్రా ఫెమా నిబంధనలను ఉల్లంఘించిందని ఈడీ ఆరోపించింది.

నిజానికి హోల్‌సేల్ వ్యాపారం చేసే సంస్థలు నేరుగా కస్టమర్లకు ఉత్పత్తులను అందించకూడదు. రిటైలర్లకు లేదా ఇతర వ్యాపార సంస్థలకు హోల్‌సేల్‌గా అమ్మాలి. అయితే మింత్రా మాత్రం తన అనుబంధ సంస్థ ద్వారా నేరుగా కస్టమర్లకు ఉత్పత్తులను అమ్మింది. ఇది ఫెమా ఉల్లంఘనల కిందకు వస్తుందని.. అందుకే కేసు నమోదు చేసినట్లు ఈడీ తెలిపింది. ఈ కేసుపై మాత్రం మింత్రా ఇంకా స్పందించలేదు.

# తొలి రోజు నువ్వా నేనా..!

### భారత్ 264/4..
### గాయంతో పంత్ రిటైర్డ్ హర్ట్
### భారత్‌కు భారీ షాక్..
### గాయంతో అంబులెన్స్‌లో మైదానం వీడిన పంత్..
### మళ్లీ బ్యాటింగ్ కష్టమేనా!

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న నాలుగో టెస్ట్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్.. 4 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. క్రీజులో రవీంద్ర జడేజా (19), శార్దూల్ ఠాకూర్ (19)లు ఉన్నారు. భారత బ్యాటర్లలో సాయి సుదర్శన్, యశస్వి జైస్వాల్‌లు హాఫ్ సెంచరీలు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో కెప్టెన్ బెన్ స్టోక్స్ అత్యధికంగా రెండు వికెట్లు తీశాడు. ఇక, టీమిండియా వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్‌కు తీవ్రగాయమైంది. నాలుగో టెస్ట్‌లో తొలి రోజు బ్యాటింగ్ చేస్తుండగా క్రిస్ వోక్స్ వేసిన బంతి నేరుగా వచ్చి పంత్.. పాదానికి తాకింది. దీంతో కుడి కాలు నుంచి రక్తం కారింది. గాయం తర్వాత పంత్.. అంబులెన్స్‌లో మైదానాన్ని వీడాడు.

**మాంచెస్టర్:** మాంచెస్టర్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్ తొలి రోజు ఆటలో భారత్, ఇంగ్లాండ్ జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. నువ్వా నేనా అన్నట్లుగా రెండు జట్లు ఆటగాళ్లు కూడా పోటీ పడుతున్నారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. తొలి రోజు ఆట ముగిసే సమయనికి 4 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. తొలి సెషన్‌లో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా భారత్ ఆధిపత్యం ప్రదర్శించింది. కానీ రెండో సెషన్‌లో మూడు వికెట్లు తీసి ఇంగ్లాండ్ సత్తాచాటింది. ఇక మూడో సెషన్‌లో ఒక వికెట్ కోల్పోయిన భారత్.. వందకు పైగా రన్స్ స్కోరు చేసింది. అయితే పంత్ గాయంతో మైదానాన్ని వీడటం టీమిండియాను కలవరపెడుతోంది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు కేఎల్ రాహుల్ (46), యశస్వి జైస్వాల్ (58) శుభారంభం అందించారు. దీంతో తొలి సెషన్‌లో భారత్ వికెట్ నష్టపోకుండా 78 రన్స్ స్కోరు చేసింది. అయితే రెండో సెషన్ ప్రారంభమైన కాసేపటికే కేఎల్ రాహుల్ ఔట్ అయ్యాడు. దీంతో 94 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇదే సెషన్‌లో జైస్వాల్, గిల్ (12) కూడా ఔట్ అయ్యారు. ఈ సెషన్‌లో మొత్తంగా 26 ఓవర్లు బ్యాటింగ్ చేసిన భారత్.. 3 వికెట్లు కోల్పోయి 71 రన్స్ స్కోరు చేసింది.

ఇక చివరి సెషన్‌లో భారత్ మళ్లీ ఆధిపత్యం ప్రదర్శించింది. ఓ వైపు రిషభ్ పంత్ (37 రిటైర్డ్ హర్ట్), సాయి సుదర్శన్ (61) రాణించడంతో 200 పరుగుల మైలురాయిని దాటింది. అయితే క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ షాట్ ఆడబోయి పంత్ కుడి కాలికి తీవ్ర గాయమైంది.





గాయం తీవ్రతకు కాలుకి వాపు వచ్చింది. రక్తం కూడా కారింది. నొప్పి తీవ్రతకు పంత్ నడవలేకపోవడంతో అంబులెన్స్‌లో అతడు మైదానం వీడాడు.

పంత్ మైదానం వీడటంతో రవీంద్ర జడేజా క్రీజులోకి వచ్చాడు. కాసేపటికే సాయి సుదర్శన్ కూడా ఔట్ అయ్యాడు. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన శార్దుల్ ఠాకూర్.. మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్.. 4 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. పంత్ మళ్లీ బ్యాటింగ్‌కు రాకపోతే.. ఐదు వికెట్లు కోల్పోయినట్లే. క్రీజులో జడేజా (19), శార్దుల్ (19) ఉన్నారు. మూడో సెషన్‌లో బారత్ 31 ఓవర్లలో ఒక్క వికెట్ కోల్పోయి 115 రన్స్ చేసింది.

ఇంగ్లాండ్ బౌలర్లలో బెన్ స్టోక్స్ రెండు వికెట్లు తీశాడు. క్రిస్ వోక్స్, లియామ్ డాసన్ ఒక్కో వికెట్ పడగొట్టారు. తొలి రోజు మొత్తంగా 83 ఓవర్ల ఆట సాగింది. అయితే బ్యాడ్ లైట్ కారణంగా కాస్త ముందుగానే ఆటను ముగించారు.



# చివరి టీ20లో భారీ హిట్టింగ్..

### అంతర్జాతీయ క్రికెట్‌కు రస్సెల్ గుడ్‌బై

**కింగ్‌స్టన్:** వెస్టిండీస్ బ్యాటర్ ఆండ్రే రస్సెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. ఇవాళ అతను తన చివరి టీ20 మ్యాచ్ ఆడేశాడు. ఆస్ట్రేలియాతో జరిగిన ఆ మ్యాచ్‌లో అతను సూపర్ పర్ఫార్మెన్స్ ఇచ్చాడు. ఆఖరి మ్యాచ్‌లో అతను చెలరేగిపోయాడు. 15 బంతుల్లో 36 రన్స్ చేసి అతను ఔటయ్యాడు. 37 ఏళ్ల రస్సెల్ టీ20 కెరీర్‌లో 1122 రన్స్ చేశాడు. అతను 86 మ్యాచ్‌లు ఆడాడు. వాటిల్లో 163 స్ట్రయిక్ రేట్ ఉన్నది. రస్సెల్ తన టీ20 కెరీర్‌లో 61 అంతర్జాతీయ వికెట్లను తీసుకున్నాడు.

సబినా పార్క్ మ్యాచ్‌లో విండీస్ ఫస్ట్ బ్యాటింగ్ చేసింది. 20 ఓవర్లలో ఆ జట్టు 8 వికెట్లు కోల్పోయి 172 రన్స్ చేసింది. ఓ దశలో 98 రన్స్‌కే కీలకమైన అయిదు వికెట్లు కోల్పోయిన విండీస్‌ను రస్సెల్ ఆదుకున్నాడు. అతని ఇన్నింగ్స్‌లో నాలుగు సిక్సర్లు, రెండు ఫోర్లు ఉన్నాయి. ఆ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా సునాయాసంగా ఛేధించింది. కేవలం రెండు వికెట్లు కోల్పోయి 16వ ఓవర్‌లో ఆ టార్గెట్‌ను అందుకున్నది. జోష్ ఇంగ్లిష్, కెమరూన్ గ్రీన్.. హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. ఆండ్రీ రస్సెల్ ఫీల్డింగ్‌కు వస్తున్న సమయంలో.. ఇరు జట్ల ఆటగాళ్లు అతని గార్డ్ ఆఫ్ హానర్ ఇచ్చారు. అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లను ఆస్ట్రేలియా కైవసం చేసుకున్నది. దీంతో సిరీస్ ఆసక్తికరంగా మారింది.



# భారత్-పాక్ మ్యాచ్ రద్దు కావడంపై స్పందించిన మహ్మద్ సిరాజ్

### ఏం చెప్పాలో తెలియడం లేదన్న మహ్మద్ సిరాజ్
### తన దృష్టి సిరీస్ పైనే ఉందన్న సిరాజ్
### తాను ఇప్పటికీ ఫిట్‌గానే ఉన్నానని వెల్లడి



**న్యూఢిల్లీ:** భారత్ - పాక్ మ్యాచ్ రద్దుపై స్టార్ క్రికెటర్ మహ్మద్ సిరాజ్ స్పందించాడు. ఈ విషయంపై తాను ఎలా స్పందించాలో తనకు తెలియడం లేదని వ్యాఖ్యానించాడు. అసలు అక్కడ ఏం జరిగిందో తనకు అవగాహన లేదని, ఏమి మాట్లాడాలో కూడా అర్థం కావడం లేదని అన్నాడు. తన దృష్టి ప్రస్తుతం సిరీస్‌పైనే ఉందని స్పష్టం చేశాడు.

తాను సంపూర్ణ ఆరోగ్యంతో, ఫిట్‌గా ఉన్నానని సిరాజ్ వెల్లడించాడు. ఆధునిక క్రికెట్‌లో వర్క్ లోడ్ కూడా ఒక భాగమేనని అభిప్రాయపడ్డాడు. ఎన్ని ఓవర్లు వేస్తున్నామనే దానిపై డేటా అందుబాటులో ఉంటుందని, దాని గురించి తాను ఆందోళన చెందడం లేదని తెలిపాడు. అయితే, తనకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, భారత విజయంలో తనవంతు పాత్ర పోషించడంపైనే దృష్టి సారించానని సిరాజ్ పేర్కొన్నాడు.

వరల్డ్ ఛాంపియన్‌షిప్ లెజెండ్స్ టోర్నీలో పాకిస్థాన్‌తో మ్యాచ్ రద్దు చేయబడింది. భారత ఛాంపియన్స్ నిషేధం విధించడంతో నిర్వాహకులు భారత్ - పాక్ మ్యాచ్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇరు జట్లకు చెరో పాయింట్లను కేటాయించారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లు ఆడకూడదని మాజీ ఆటగాళ్లు సైతం తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# వన్డే సిరీస్‌ను నెగ్గిన టీమిండియా

### ఆఖరి వన్డేలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సెంచరీ..
### ఆరు వికెట్లు పడగొట్టిన క్రాంతిగౌడ్

**లండన్:** ఇంగ్లండ్ పర్యటనలో భారత మహిళల జట్టు అద్భుతంగా రాణించి మూడు వన్డేల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకున్నది. ఆతిథ్య జట్టుతో దర్హమ్ వేదికగా మూడో వన్డే జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసి టీమిండియా 50 ఓవర్లకు ఐదు వికెట్ల నష్టానికి 318 పరుగులు భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అద్భుత బ్యాటింగ్ (102 పరుగులు) చేసి కెరీర్‌లో ఏడో శతకాన్ని నమోదు చేసింది. 82 బంతుల్లో 14 ఫోర్ల సహాయంతో 102 పరుగులు చేసింది. జెమీమా రోడ్రిగ్స్ (50 పరుగులు)తో నాలుగో వికెట్‌కు 110 పరుగులు జోడించింది. హర్లీన్ (45), మంధన (45) రాణించారు. చివరలో వికెట్ కీపర్ కం బ్యాటర్ రిచా ఘోష్ 18 బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో 38 పరుగులు చేయడంతో టీమిండియా భారీ స్కోర్ సాధించింది. అయితే, 40 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసిన టీమిండియా.. చివరి పది ఓవర్లలో ఏకంగా 120 పరుగులు చేసింది. తొలుత 54 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్.. సెంచరీని మిగతా 28 బంతుల్లోనే పూర్తి చేసింది. ఇంగ్లండ్ బౌలర్లు లారెన్ బెల్, లారెన్ ఫైలర్, షార్లెట్ డీన్, సోఫీ ఎక్లెస్టోన్, లిన్సే స్మిత్‌లకు ఒక్కో వికెట్ దక్కింది.

టీమిండియా విధించిన 319 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు ఇంగ్లండ్ 305 పరుగులకే ఆలౌట్ అయ్యింది. టీమిండియా బౌలర్ క్రాంతి గౌడ్ తొలుత ప్రారంభంలోనే రెండు వికెట్లు తీసి భారత జట్టులో ఉత్సాహం నింపింది. ఆమీ జోన్స్ (4), టామ్సిన్ బ్యూమాంట్ (2) కాంత్రి బౌలింగ్‌లో పెవిలియన్‌కు చేరారు. ఆ తర్వాత ఎమ్మా లాంబ్ (68), నట్ స్కీవర్ బ్రంట్ (98) ఇంగ్లండ్ స్కోర్ బోర్డ్‌ను పరుగులెత్తించారు. మూడో వికెట్‌కు ఇద్దరు 160 పరుగులకుపైగా భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఇంగ్లండ్ 170 పరుగుల వద్ద ఎమ్మా లాంబ్‌ను చరణి క్లీన్ బౌల్డ్ చేసి.. ఈ జోడీని విడదీసింది. ఆ తర్వాత నటాలీ స్కీవర్ బ్రంట్‌ను దీప్తిశర్మ పెవిలియన్‌కు పంపింది. నటాలీ తృటిలో సెంచరీ మిస్సయ్యింది. నటాలీ 105 బంతుల్లో 11 ఫోర్ల సహాయంతో 98 పరుగులు చేసి అవుట్ అయ్యింది. ఆ తర్వాత ఆలిస్ డేవిడ్సన్-రిచర్డ్స్ (44), చార్లీ డీన్ (21) రాణించారు. మిగతా బ్యాట్స్‌మెన్ పెద్దగా రాణించకపోతే ఇంగ్లండ్‌కు ఓటమి తప్పలేదు. టీమిండియా బౌలర్లలో క్రాంతి గౌడ్‌కు ఆరు వికెట్లు, దీప్తిశర్మ, శ్రీచరణికి రెండు వికెట్లు దక్కాయి. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను టీమిండియా 2-1 తేడాతో నెగ్గింది. ఇంతకు ముందు టీ20 సిరీస్‌ను 3-2 తేడాతో గెలిచిన విషయం తెలిసిందే.



# విడుదల తేదీ ప్రకటించిన విజయ్ ఆంటోని 'భద్రకాళి'




**టాకీస్:** తమిళ నటుడు విజయ్ ఆంటోనీ హీరోగా వస్తున్న 25వ సినిమా 'భద్రకాళి'. ఈ సినిమాకు అరుణ్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. తమిళంలో 'శక్తి తిరుమగన్' పేరుతో విడుదల కానున్న ఈ చిత్రం తెలుగులో 'భద్రకాళి' పేరుతో రాబోతుంది. వాగై చంద్రశేఖర్, సునీల్ కృపలానీ, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర, మాస్టర్ కేశవ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ఈ సినిమాను 2025 సెప్టెంబర్ 5న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు.

ఈ చిత్రం పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతుంది. రూ. 190కోట్ల కుంభకోణం చుట్టూ నడిచే కథ ఇదని, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుందని, విజయ్ ఆంటోని పాత్ర డిఫరెంట్ షేడ్స్‌తో సాగుతుందని మేకర్స్ తెలిపారు.

## షెడ్యూల్ ప్రకారమే మిరాయ్ విడుదల




టాకీస్: హనుమాన్ సినిమాతో పాన్ ఇండియా ఇమేజ్ సొంతం చేసుకున్నాడు యువ నటుడు తేజసజ్జా ఈ టాలెంటెడ్ యాక్టర్ హీరోగా నటిస్తున్న మరో పాన్ ఇండియా అడ్వెంచరస్ మూవీ మిరాయి. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో ఢిల్లీ భామ రితికా నాయక్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. సినిమా కోసం ఎదురుచూస్తున్న వారి కోసం మ్యూజికల్ అప్‌డేట్ అందించారు. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ వైబ్ ఉంది అప్‌డేట్ అందించారు. వైబ్ ఉంది అంటూ సాగే మెలోడీ ట్రాక్‌ను జులై 26న తెలుగుతోపాటు- పలు ప్రధాన భాషల్లో విడుదల చేయ నున్నట్టు ప్రకటించా రు. సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో తేజ సజ్జా, రితికా నాయక్ రొమాంటిక్ ఫోజులో ఉండటం చూడొచ్చు. మిరాయి అనుకున్న షెడ్యూల్ ప్రకారమే 2025 సెప్టెంబర్ 5న పలు భాషల్లో విడుదల కానున్నట్టు- ప్రకటించి సినిమా వాయిదా పుకార్లకు చెక్ పెట్టారు మేకర్స్. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీ-జీ విశ్వప్రసాద్ తెరకెక్కిస్తుండ గా.. గౌరా హరి సంగీతం అందిస్తున్నా రు. ఈ మూవీ 2డీ, 3డీ వెర్షన్లలో ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో గ్రాండ్‌గా విడుద ల కానుందని ఇప్పటికే వార్తలు రాగా.. దీని పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. మేకర్స్ ఇప్పటికే విడుదల చేసిన మిరాయి టైటిల్ గ్లింప్స్ వీడియోకు మంచి స్పందన వస్తోంది.

# 20 ఏళ్ల కెరీర్‌లో ఎంతో నేర్చుకున్నా: రెజీనా



టాకీస్: సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చి గుర్తింపు తెచ్చుకున్నారు నటి రెజీనా. ఆమె పరిశ్రమకు వచ్చి 20 ఏళ్లు అయిన సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి మాట్లాడారు. 20 ఏళ్ల కెరీర్‌ను మైలురాయిగా ఎందుకు చూస్తారో అర్థమైందన్నారు. కానీ, తాను కొన్ని విషయాల్లో అగ్రస్థానంలో లేనన్నారు. కొన్నేళ్లుగా వరుసగా తెరపై కనిపించనప్పటికీ 20 ఏళ్లంటే చాలా పెద్ద విషయమని చెప్పారు. గతంలో ఓమారు సంవత్సరంలో నాకు పని చేయాలనిపించలేదు. యాక్టింగ్ మానేయాలనుకున్నాను. అంగీకరించిన ప్రాజెక్ట్‌లు పూర్తి చేశాను. 2018 నుంచి అవకాశాలు వరుస పెట్టాయి. ఒకేతరహా పాత్రల్లో నటించకూడదని నిర్ణయించుకున్నాను. టాలీవుడ్‌లోకి వెళ్లిన తొలినాళ్లలో ఉదయం 6 గంటలకే నాకు డైలాగులు తెచ్చి ఇచ్చేవారు. అప్పుడు నాకు తెలుగు రాదు. దీంతో ఎంతో కష్టపడాల్సి వచ్చింది. అన్ని డైలాగులు కంఠస్థం చేశాను. భావోద్వేగాలను అర్థం చేసుకున్నాను. లైన్ టూ లైన్ నేర్చుకోవడం ప్రాక్టీస్ చేశా. ఇప్పుడు తెలుగు బాగా మాట్లాడగలను. నాకు సినీ నేపథ్యం లేదు. ఇండస్ట్రీకి రావాలనుకున్నప్పుడు నటించి, ఇంటికి వచ్చేయడమే అని భావించాను. కానీ, కాలం గడిచేకొద్దీ పీఆర్‌లు, సోషల్ మీడియా ప్రాధాన్యం గురించి అర్థమైంది. నేను వీటికి చాలా రోజులు దూరంగా ఉన్నాను. నా నటనను చూసి అవకాశం ఇవ్వాలి కానీ, పబ్లిసిటీ చూసి కాదని అనుకున్నాను. కానీ, ఇప్పుడు సోషల్ మీడియా ద్వారానే నా పనిని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్తున్నాను' అని చెప్పారు.

# రతన్ టాటా కూడా పెళ్లి చేసుకోలేదు: నిత్యామీనన్



టాకీస్: బాష తో సంబంధం లేకుండా ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి నిత్యా మేనన్,. ఇప్పుడు 'సార్ మేడమ్' చిత్రంతో మళ్లీ అభిమానుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమా జూలై 25న విడుదల కాబోతున్న సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిత్య, ప్రేమ, సంబంధాల గురించి తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకున్నారు. నిత్య మాట్లాడుతూ.. 'ఒకప్పటి నా ఆలోచనలతో పోలిస్తే, ఇప్పుడు ప్రేమకు నా జీవితంలో అంత ప్రాధాన్యం లేదు. ప్రేమకు, సోల్‌మేట్‌కు మనం అవసరమని, లేకపోతే జీవితం అసంపూర్ణమని అనుకునే రోజులు నాకు కూడా వచ్చాయి. అలాంటి వ్యక్తిని వెతికిన అనుభవం కూడా ఉంది. కానీ.. కాలక్రమేణా అర్థమైంది.. మన జీవితం ఒక్క వ్యక్తి మీద ఆధారపడి ఉండాల్సిన అవసరం లేదని. ఒక్కరే ఉండటం ఒక లోపం కాదు. రతన్ టాటా కూడా పెళ్లి చేసుకోలేదు కదా! జీవితంలో పెళ్లి జరగకపోయినా మరేదేం ఉండదు. కొన్నిసార్లు తోడు లేదు అనే బాధ కలుగుతుంది, కానీ నేను ఈ స్వేచ్ఛను ఆస్వాదిస్తున్నాను. జీవితంలో అనుభవించిన పాఠాల వల్లే నేను ఈ స్థితిలో ఉన్నాను. ఏదైనా జరిగిన అది మన మంచికే అనుకోవడం నేర్చుకున్నాను' అని అన్నారు. నిత్య మాటలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## 'కరుప్పు' టీజర్ విడుదల

**టాకీస్:** తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటులలో కథానాయకుడు సూర్య ఒకరు. ఆయన నటించిన ప్రతి సినిమా ఇక్కడ కూడా విడుదలవుతుంది. అంతేకాదు, వైవిధ్యానికి పెద్ద పీట వేస్తూ ఆసక్తికర చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు



వస్తారు. ఇప్పటికే తెలుగు దర్శకుడు వెంకి అట్లూరితో సినిమా చేస్తున్న సూర్య తమిళ కమెడియన్ ఆర్జే బాలాజీ దర్శకత్వంలో కరుప్పు అనే సినిమా చేస్తున్నాడు. నేడు సూర్య బర్త్‌డే కావడంతో మూవీ నుంచి టీజర్‌ను వదిలారు మేకర్స్. 'నా పేరు సూర్య.. నాకు ఇంకోపేరు కూడా ఉంది', 'ఇది మన టైమ్' అంటూ సూర్య తన వింటేజ్‌లుక్‌లో అదరగొడుతున్నాడు. జై భీమ్ తర్వాత మళ్లీ ఈ చిత్రంలో సూర్య మరోసారి న్యాయవాది పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ మూవీకి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నాడు. త్రిష కథానాయికగా నటిస్తుంది.

## ఛత్రపతి ప్రాజెక్టును రద్దు చేసుకున్నాం: అమిత్ రాయ్



**టాకీస్:** మరాఠా చక్రవర్తి ఛత్రపతి శివాజీ మహారాజ్ బయోపిక్‌లో బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్ నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌కు అమిత్ రాయ్ దర్శకత్వం వహించబోతున్నట్లు- బాలీవుడ్ మీడియాలో పలు కథనాలు వెల్లడయ్యాయి. అయితే తాజాగా ఈ ప్రాజెక్ట్ రద్దయినట్లు దర్శకుడు అమిత్ రాయ్ ప్రకటించాడు. ఈ ప్రాజెక్ట్ నిలిచిపోవడానికి గల ఖచ్చితమైన కారణాలను ఆయన వెల్లడించనప్పటికీ, బాలీవుడ్ పరిశ్రమపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పరిశ్రమ క్రూరమైందని విమర్శించారు. పరిశ్రమలో జరిగిన అనుభవం తనకు ఒక పాఠం నేర్పించిందని, అందుకే తన తదుపరి చిత్రాన్ని తానే నిర్మించుకోవాలని నిర్ణయించుకున్నానని అమిత్ రాయ్ తెలిపారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.